


రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు

- కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితాలో చోటు
- సరిహద్దు గ్రామాల ఓటర్ల జాబితాలో వింతలు

పెద్దతిప్పసముద్రం, జనవరి 17 : పీటీఎం మండలంలోని టి.సదుం పంచాయతీ జంబుగానిపల్లెలో సుమారు 150 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 60 మందికి పైగా ఓటర్లు అటు కర్ణాటకలోనూ, ఇటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఓటర్లుగా నమోదై ఉన్నారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దుకు కూతవేటు దూరంలో జంబుగానిపల్లె ఉండడంతో చిరునామాలు మార్చి ఓటర్లుగా కర్ణాటక రాష్ట్రంలో ఓట్లు నమోదు చేసుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఓటు హక్కు కలిగి ఉండడంతో వీరికి రెండు విధాలా లాభదాయకంగా మారుతోంది. ఇవే కాకుండా మండలంలోని సంపతికోట, మల్లెల పంచాయతీలోని ఉప్పరవాండ్లపల్లె, పట్టెంవాండ్లపల్లె పంచాయతీ కమ్మచెరువు, మారుగానిపల్లె, టి.సదుం పంచాయతీ రేకలగుంటిపల్లె, గుంటిపల్లె, బూచిపల్లె, కానుగమాకులపల్లె గ్రామాల్లో ఇంకా చాలామంది ఓటర్లు ఏపీతో పాటు కర్ణాటక రాష్ట్రంలో కూడా ఓటు హక్కు కలిగి ఉన్నారు. సరిహద్దు గ్రామాల్లో ఉన్న కొంతమంది కర్ణాటక రాష్ట్రంలోని నాయకుల అండదండలతో అక్కడ ఓటు హక్కును పొంది అక్కడి ఎన్నికల్లో ఓటును వేశారు. ఉదాహరణకు జంబుగానిపల్లెకు చెందిన అశ్విని భర్త పేరు ఈశ్వర్‌రెడ్డి అనే మహిళకు టి.సదుం పంచాయతీలో ఓటు హక్కు ఉంది. దీంతో పాటు కర్ణాటకలో ఓటు కలిగి ఉంది. అలాగే ఈశ్వర్‌రెడ్డి, రామలక్షుమమ్మ, బాబురెడ్డి, మద్దిరెడ్డి అనే ఐదుగురికి ఇరు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగి ఉన్నారు. సంబంధిత అధికారులు మండలంలోని సరిహద్దు గ్రామాల్లో ఓటర్ల జాబితాపై దృష్టి పెడితే ఇలాంటివి మరిన్ని బయటపడే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు, బీఎల్వోలు ఇటువంటి వాటిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

- ముటేషన్లకు భారీగా వసూళ్లు
- పని కాక బాధితుల పరుగులు
- డబ్బులిచ్చేయాలని డిమాండ్
- కురబలకోట రెవెన్యూలో కలకలం



రెవెన్యూలో వసూల్ రాజాలు!

రూ.2.80 లక్షలు తీసుకున్నారు..



ముదివేడు రెవెన్యూ గ్రామంలో మాకు పెద్దల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిలో ఎకరా భూమిని మ్యుటేషన్ చేయడానికి రూ.2.80 లక్షలు తీసుకున్నారు. ఆరు నెలలు అవుతున్నా..పని చేయకుండా తిప్పుతున్నారు. ఫైలు సిద్ధమై క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించిన అధికారికి అంచెలంచెలుగా సొమ్ము ఇచ్చాను. ఇప్పటికీ రేపు, మాపంటూ కాలం గడిపేస్తున్నారు. బదిలీ అవుతున్నారని, వెంటనే పని చేయాలని నిలదీస్తే కార్యాలయానికే రావద్దంటూ మండిపడుతున్నారు. గ్రామస్థాయిలో నేను అధికార పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్తను. నేను ఒక్కడినే కాదు..మండలంలో వివిధ పనుల కోసం వందమంది వరకూ బాధితులు ఉన్నారు. వీరి నుంచి రూ.లక్షలు వసూలు చేశారు. మీ పేరు మీద లేకుంటే రీసర్వేలో వెళ్లిపోతుందని చెప్పడంతో భయపడ్డాను.

- ఎం.మంజర్‌అలీఖాన్, బాధితుడు, ముదివేడు, కురబలకోట మండలం

ఆఫీసు ముందు ఉరి వేసుకుందామనుకున్నా..



ముదివేడు రెవెన్యూ గ్రామంలో నాకున్న భూమిని నా ఇద్దరు కుమారులకు రాసిచ్చాను. నా పేరు నుంచి వారికి మ్యుటేషన్ చేయడానికి డైరెక్ట్‌గా పెద్ద సారు దగ్గరికే వెళ్లాను. పని కావాలంటే రూ.50 వేలు అవుతుందన్నారు. నా భార్య నగలు బ్యాంకులో కుదువపెట్టి రూ.45 వేలు ఇచ్చాను. అది కూడా ఇంటికెళ్లి ఇచ్చినా. మిగిలిన అయిదువేలు కూడా పని అవుతానే ఇస్తానని చెప్పాను. నేను రోజూ పొలం పనులకు కూలికి వెళ్తా. సారు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లిపోతున్నాడని అందరూ చెబుతాండరు. అందుకని పని వదిలేసి, నేను, నా కొడుకు రోజూ ఆఫీసుకు వెళ్తన్నాము. బిజీగా ఉన్నాము..చేసేస్తామని చెబుతాండరు. గట్టిగా అడిగితే ఆపరేటర్‌తో మాట్లాడమని చెబుతున్నారు. నాకు విరక్తి పుట్టి ఎంట్రీన్ బాటిల్ తెచ్చి ఇంట్లో పెట్టుకున్నా. ఇది తాగేసి, ఎమ్మార్వో ముందరే ఉరి వేసుకుందామని చాలాసార్లు నిర్ణయం తీసుకున్నాను. ఈ భూమే వద్దనిపిస్తాంది. చనిపోతే పోతుంది..నేను పోతాను..వాళ్లు పోతారు. నాలాంటి వాళ్లు ఎంతోమంది రోజూ ఆఫీసుకు వచ్చి, డబ్బులు ఇమ్మని అడుగుతుంటారు. ఎక్కడో నాలో ఉన్న కొంత ఆశతో పని చేస్తాడనే నమ్మకంతో ఉన్నా..చూద్దాం. పని చేయకుంటే, డబ్బులు కూడా ఇచ్చేయమని అడుగుతున్నా.

- పి.సుబ్బాచారి, బాధిత రైతు, చిగిరేవారిపల్లె, కురబలకోట మండలం

మదనపల్లె, జనవరి 17: కురబలకోట తహసీల్దార్ కార్యాలయం వసూళ్లకు అడ్డాగా మారింది. పనికావాలంటే పైసలివ్వాల్సిందే. పట్టాలు జారీ చేయడం నుంచి భూముల మ్యుటేషన్ల వరకూ సొమ్ములు వసూలు చేస్తున్నారు. ఇందులో వసూల్‌రాజాలు ప్రతి పనికీ ఒక రేటు నిర్ణయించారు. పట్టాకు రూ.10 వేల నుంచి భూముల ఆన్‌లైన్‌కు రూ.లక్ష నుంచి విస్తీర్ణాన్ని బట్టి ఫిక్స్ చేశారు. ఒకానొక దశలో పని ఏదైతేనేం..పైసలివ్వండనే స్థాయిలో ప్రవర్తిస్తున్నారు. మరోవైపు డీకేటీ, అసైన్డ్ భూములు కూడా ఒకరి నుంచి మరొకరి పేరున మార్చేస్తున్నారు. అలాగే 2003కు ముందు జారీ చేసిన డీకేటీ, అసైన్డ్ భూములపై ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తివేస్తూ, సేల్‌బుల్ రైట్స్ కల్పిస్తోంది. ఫ్రీహోల్డ్ పథకం జాబితాలో పేరు చేర్చడానికి ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్షకు పైగా వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. భూముల రీసర్వేలోనూ రెవెన్యూ శాఖ చేతివాటం ప్రదర్శిస్తోంది. ఇందులో భూములు ఆన్‌లైన్‌లో లేకుంటే రీసర్వేలో వెళ్లిపోతాయని బెదిరిస్తూ, రైతుల నుంచి రూ.లక్ష రూపాయలు వసూలు చేసినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. రెవెన్యూ శాఖలోని ఈ నాలుగు విభాగాల నుంచి వేర్వేరుగా అన్ని వర్గాల ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. పని పూర్తికావడానికి వాయిదాల మీద వాయిదాలు వేస్తూ, వివిధ కారణాలతో కాలయాపన చేస్తున్నారు. దీంతో తిరిగి వేసారిపోయిన బాధితులు ఏకంగా అక్కడి సిబ్బంది, అధికారులతో వాదనకు దిగుతున్నారు. ఇక్కడ అధికారులు అందుబాటులో లేకుంటే, ఏకంగా ఇంటికే వెళ్లి పనులపై ప్రశ్నిస్తున్నారు. కురబలకోట రెవెన్యూ కార్యాలయం వసూళ్లకు కేరాఫ్‌గా మారిందనే ప్రచారం మొదటి నుంచీ ఉన్నా..బాధితుల నుంచి ఫిర్యాదులు వెళ్తున్నా..ఎవరూ పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.



బదిలీతో బయటకు బాధితులు

రెవెన్యూలో వసూళ్ల పర్వం రెండేళ్లుగా సాగుతున్నా పని కాని బాధితులంతా నెలరోజులుగా ప్రశ్నించడం మొదలు పెట్టారు. అప్పటికీ పెట్టిన గడువులన్నీ దాటిపోయినా..పని కాకపోవడంతో ఇచ్చిన డబ్బులు వెనక్కి ఇచ్చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బాధితులంతా సచివాలయం, రెవెన్యూ కార్యాలయం..అక్కడా దొరకకపోతే డైరెక్ట్‌గా ఇళ్లకే వెళ్లి పంచాయితీలు పెడుతున్నారు. సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో రానున్న నేపథ్యంలో ఇక్కడి అధికారులు బదిలీ అవుతున్నారనే విషయం బాధితులకు చేరింది. అదే వారి ఆందోళనకు కారణమైంది. ఇక మా పని కాదని తెలుసుకున్న వారంతా..రోజువారి కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నట్లు వాపోతున్నారు. ఈ క్రమంలో తాడోపేడో తేల్చుకునే క్రమంలో ఉన్నారు.

రెవెన్యూలో ప్రైవేటు పెత్తనం

మండలంలో ఏ పని కావాలన్నా..అధికార పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకుల ప్రమేయం ఉండనే ఉంటోంది. వీరితో పాటు ఏ ఫైలులో అయినా సంతకం చేయడానికి ఒక వీఆర్వోను ఎంచుకున్నారు. పని ఎలాంటిదనే దానితో ప్రమేయం లేకుండా సంతకం చేయడం ఈయన పని. మరీ ముఖ్యంగా ఇక్కడి కార్యాలయంలో ప్రైవేటు ఆపరేటర్ పెత్తనం కొనసాగుతోంది. డీల్ కుదుర్చడం నుంచి పని కానిచ్చేయడం వరకూ అతడిపైనే ఆధారపడింది. రెవెన్యూ సిబ్బంది నుంచి అధికారుల వరకూ ఎక్కడ తేడా వచ్చినా, అతడిని కలవండని చెబుతుంటారు. అతను ఓకే అంటేనే..తర్వాత పని పూర్తవుతుంది. ఇక్కడ పనులన్నింటికీ ఆయనే..అండా..దండా. పెద్ద ప్రజాప్రతినిధి తర్వాత అంతా వీరిదే పెత్తనం. అయిన వారికో లేక కావల్సిన వారికో పెద్దలు ఏదైనా ఒకటి రెండు చేయండని సిఫార్సు చేస్తే..వాటి చాటున వీరంతా మరో నాలుగు పనులు చేసేస్తున్నట్లు చెబుతున్నారు. ద్వితీయశ్రేణి నేతల ప్రమేయం లేకున్నా రెవెన్యూలో కీలకమైన కీని ఆపరేట్ చేసే ప్రైవేటు వ్యక్తి పెత్తనమే అధికంగా ఉందని శాఖాధికారులు వాపోతున్నారు.

పక్కాగా ఉన్నవి చేసేశాం..

రికార్డులు పక్కాగా ఉన్నవి పనులు చేసేశాం. ఆన్‌లైన్‌లో ఎందుకు లేవని, ఎందుకు చేయలేదో కలెక్టర్‌కు రిపోర్టు పంపిస్తాం. మ్యుటేషన్‌కు డబ్బులు తీసుకుని తిరుగుతున్నారని, మా వీఆర్వోలు, ఆర్ఐ ఎవరూ చెప్పలేదు. బయట ఎవరైనా పొరపాటున అనుకుని ఉండవచ్చు. లేదంటే ఎవరైనా పని చేసిస్తామని డబ్బులు తీసుకుని ఉంటే మాకు సంబంధం లేదు. ఈ విషయాలు మీకెవరు చెప్పారు. ఇక్కడ అలాంటివేమీ జరగడం లేదు.

- భీమేశ్వరరావు, తహసీల్దార్, కురబలకోట

వడ్డీకి అప్పు తెచ్చి ఇచ్చినా..



ముదివేడు రెవెన్యూ గ్రామంలో మా మామ ఎస్.సత్తార్‌ఖాన్ పేరున ఉన్న ఆస్తిని ఆయన కుమారులైన ఇద్దరి పేరున చెరో సగం మ్యుటేషన్ చేయమని తిరుగుతున్నాం. నా భర్త చనిపోయాడు. మా అన్న ద్వారా ఆఫీసు చుట్టూ ఆరు నెలలుగా తిరుగుతున్నాం. ఇప్పటికే రూ.90 వేలు ఇచ్చాం. ఇంకా లక్ష రూపాయలు ఇస్తే పనిచేస్తామంటున్నారు. ఇప్పటికే ఇచ్చిన డబ్బుతో పనికాలేదు. ఆరునెలలుగా తిప్పుతున్నారు. ఇక నమ్మకం లేక అప్పు చేయలేక ఇవ్వలేదు. నేను ఎప్పుడూ బయటకు వచ్చిందే లేదు. పని కానప్పుడు..చేయలేనప్పుడు డబ్బులు ఎందుకు అడగాలి? ఎందుకు తీసుకోవాలి. నాకు నలుగురు ఆడబిడ్డలు. భూమి అమ్మేసి ఇచ్చేద్దామనే అప్పు చేసి పెళ్లిళ్లు చేశా. నా భర్త, నా పేరు మీద కాకుండా మా మామ పేరున ఆస్తి ఉందని ఎవరూ కొనడం లేదు.

- నయాబ్ షబానా, బాధితురాలు, ముదివేడు, కురబలకోట మండలం

పింఛనుతో అప్పు తీరుస్తున్నా..



మట్లివారిపల్లె రెవెన్యూ గ్రామంలో భర్త ఎం.మురాషాబేగ్ పేరుతో ఉన్న ఆస్తిని నా పేరున మార్చి, ఈ-పాస్ బుక్కు ఇవ్వాలని అధికారులను కోరుతున్నాము. స్పందనలో కూడా రెండుసార్లు అర్జీ ఇచ్చినా. నా పని చేయాలని వీఆర్వో, ఎమ్మార్వోకు కలెక్టర్ చెప్పినారు. చేస్తామన్నారు. అయినా రూ.50 వేలు అడిగితే రూ.20 వేలు ఇచ్చాను. ఆరు నెలలుగా పనిచేయకుండా తిప్పుకుంటున్నారు. అంత డబ్బులు నేను ఎక్కడి నుంచి తెచ్చి ఇచ్చేది. నేను షుగర్ వ్యాధితో బాధపడుతున్నా. ఇద్దరు కొడుకులు..ఆటోలు నడుపుకుంటూ జీవిస్తున్నారు. నాకు నెలనెలా వచ్చే పింఛన్‌తో బతుకుతున్నా. ఆ 20 వేలు కూడా అప్పు చేసి ఇచ్చినా. మా దగ్గరా డబ్బులు తీసుకునేది? పోనీ తీసుకున్నారు..పని చేయాలి కదా? లేదంటే కాదని చెప్పాలి. తిప్పుకోవడం ఎందుకు?. అడిగితే వీఆర్వో, తహసీల్దార్ ఒకరిమీద ఒకరు వేసుకుంటున్నారు.

- ఎం.నసీబ్‌జాన్, బాధితురాలు, ఇందిరానగర్, మదనపల్లె

ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదు

- కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె

రాయచోటి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని ఎంతో సామరస్యంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తోందని, రెచ్చగొట్టేకొద్దీ ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేస్తామని అంగన్వాడీలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారంతో 37వ రోజుకు చేరుకుంది. జిల్లావ్యాప్తంగా పలుచోట్ల అంగన్వాడీలు నిరసన దీక్షలను కొనసాగించారు. వాల్మీకిపురంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట బుధవారం తమకు ఇచ్చిన షోకాజ్ నోటీసుల విషయమై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయంలో సీడీపీవో అందుబాటులో లేకపోవడంతో షోకాజ్ నోటీసులతో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. రైల్వేకోడూరు పట్టణంలో అంగన్వాడీలు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలకైనా సిద్ధంగా ఉన్నామని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కన్వీనర్ నాగేశ్వరి అన్నారు. రాయచోటిలో అంగన్వాడీలు చేపడుతున్న సమ్మెలో భాగంగా 37వ రోజు రాయచోటి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు నిరసన వ్యక్తం చేసి ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రం అందచేశారు.



వాల్మీకిపురం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట షోకాజ్ నోటీసులను వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ప్రతిష్ఠాత్మకంగా చంద్రబాబు సభ

- ప్రతి గ్రామం నుంచి జనసమీకరణ చేయాలి
- టీడీపీ శ్రేణులకు నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి దిశానిర్దేశం



పీలేరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

పీలేరు, జనవరి 17: పీలేరులో ఈనెల 24వ తేదీ జరగనున్న చంద్రబాబునాయుడు బహిరంగ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు బహిరంగసభ నేపథ్యంలో బుధవారం ఆయన పీలేరు మండల టీడీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు పర్యటనలు చంద్రబాబుకు సెంటిమెంటుగా మారాయని, గత సంక్రాంతికి పీలేరు సబ్‌జైలు, కలికిరిలో జరిగిన రాజంపేట పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్ష సమావేశం విజయవంతం కావడం పట్ల ఆయన అప్పట్లో ఎంతో సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. అందుకే ఆయన రాజంపేట పార్లమెంటు పరిధిలో జరగనున్న 'రా..కదిలిరా' కార్యక్రమాన్ని పీలేరులో ఏర్పాటు చేశారని తెలిపారు. పీలేరు నియోజకవర్గ ప్రజలపై ఆయన పెట్టుకున్న నమ్మకం వమ్ము కాకుండా ఇక్కడ జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. పీలేరు పట్టణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండాలన్న ఆలోచనతో చంద్రబాబు సభను పీలేరు-మదనపల్లె మార్గంలోని ఏపీఐఐసీ లేఔట్ సమీపంలో ఏర్పాటు చేశామని, 24న ఉదయం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్ర పరిధి నుంచి సుమారు 300 మందిని జనసమీకరణ చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున జనసమీకరణ జరగాలని తెలిపారు. అనంతరం ఆయన పీలేరు మండలంలోని పంచాయతీల వారీగా సభ కోసం చేపట్టాల్సిన చర్యలు, జనసమీకరణలో పాటించాల్సిన మెలకువలపై పార్టీ శ్రేణులతో సమీక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటపల్లె బాబు, శ్రీకాంత్ రెడ్డి, మల్లెల రెడ్డిబాషా, అమరనాథరెడ్డి, రెడ్డప్పరెడ్డి, పురం రామ్మూర్తి, లక్ష్మీకర, రాజగోపాల్ నాయుడు, షౌకత్‌అలీ, అత్తార్ చాను, ఇస్మాయిల్, నాగేంద్ర నాయక్, జనసేన నాయకులు కలప రవి, గజేంద్ర, మోహనకృష్ణ, గౌస్‌బాషా, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

కిశోర్‌ను కలిసిన పారిశ్రామికవేత్త

పుంగనూరు నియోజకవర్గానికి చెందిన ప్రముఖ టీడీపీ నాయకుడు, పారిశ్రామికవేత్త వల్లిగట్ల రెడ్డప్ప బుధవారం పీలేరులో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని కలిసి సన్మానించారు. పుంగనూరు నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా రెడ్డప్పకు తెలిపారు. కార్యక్రమంలో బీసీ నాయకులు జనార్ధన్‌గౌడ్, రెడ్డిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

24న చంద్రబాబు సభను విజయవంతం చేయండి

- టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

రాయచోటి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పీలేరు పట్టణంలో ఈనెల 24వ తేదీ జరగనున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బహిరంగసభను విజయవంతం చేయాలని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఈ బహిరంగసభకు హాజరు కావాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పార్లమెంట్ పరిధిలోనూ ఒక నియోజకవర్గంలో చంద్రబాబు సారథ్యంలో బహిరంగసభలు జరుగుతున్నాయని, అన్నిచోట్లా ప్రజలు చంద్రబాబుకు బ్రహ్మరథం పడుతున్నారు. పీలేరులో జరిగే సభను జయప్రదం చేయాలని ఆయన అందరికీ పిలుపునిచ్చారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 17: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో త్వరితగతిన కనీస సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ పీఎస్ గిరీషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి తహసీల్దార్‌లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1607 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఈనెల 26వ తేదీ లోపు అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. 70 పోలింగ్ కేంద్రాల్లో కరెంటు సదుపాయం లేదని వెంటనే వీటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. సెక్టోరల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణ సంబంధించి ప్రతి అంశాన్ని సంబంధిత అధికారులు సీరియస్‌గా తీసుకుని పనులు చేపట్టాలని ఇందులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాయచోటి, మదనపల్లె, రాజంపేట ఆర్డీవోలు రంగస్వామి, మురళి, రామకృష్ణారెడ్డి, డీఈవో పురుషోత్తం, తహసీల్దార్లు పాల్గొన్నారు.

భార్యపై అనుమానంతో కొడవలితో దాడి

- పరిస్థితి విషమం

మదనపల్లె టౌన్, జనవరి 17: భార్యపై అనుమానంతో ఓ భర్త అందరూ చూస్తుండగానే కొడవలితో భార్యను కిరాతకంగా నరికాడు. వివరాలిలా ఉన్నాయి.. మదనపల్లె మండలం కొత్తఇండ్లుకు చెందిన హేమలతకు చౌడేపల్లెకు చెందిన నగేశ్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. హేమలత స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను వేధించేవాడు. ఈ క్రమంలో బుధవారం హేమలత పనిచేస్తున్న ప్రైవేటు ఆస్పత్రి వద్దకు వచ్చిన భర్త నగేశ్ ఆమెతో గొడవ పడ్డాడు. అంతే కాకుండా వెంట తెచ్చుకున్న కొడవలితో భార్య మెడపై కిరాతంగా నరికాడు. అక్కడే ఉన్న స్థానికులు ఈ ఘటనను వీడియో తీయడంతో నిందితుడు పారిపోయాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా బాధితురాలు అపస్మారక స్థితిలో ఉండటంతో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.



భార్య హేమలతపై కొడవలితో దాడి చేస్తున్న భర్త నగేష్

మోటార్ సైకిళ్ల చోరీ కేసులో ఇద్దరు వ్యక్తులు అరెస్ట్


నిందితులు, స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపుతున్న ఎస్ఐ రోషన్

సింహాద్రిపురం, జనవరి 17: మండల పరిధిలో మోటార్ సైకిళ్ల దొంగిలించిన కేసులో ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎస్కే. రోషన్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు.. ఈ నెల 11వ తేదీ కడపనాగయ్యపల్లికి చెందిన ఓ రైతు తన చీనీ తోట వద్ద వున్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. అలాగే ఈ 13వ తేదీ అగ్రహారం గ్రామంలో ఓ రైతు చీనీ తోట వద్ద వుంచిన టీవీఎస్ ఎక్సెల్ వాహనం చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసుల ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టారు. అనుమానితులుగా గుర్తించిన సింహాద్రిపురానికి చెందిన మామిళ్ల రామాంజనేయులు, అయ్యర్ రాములను విచారించగా వాహనాలు దొంగిలించినట్లు వారు ఒప్పుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు. దొంగిలించిన వాహనాలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసి.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రైతులు తమ వ్యవసాయ పొలాల వద్ద, చీనీ తోటల వద్ద వాహనాలు పార్కింగ్ చేసినప్పుడు సైడ్ లాక్ వేసి జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ సూచించారు.

హోటల్‌లో విజిలెన్స్ తనిఖీలు

● ఐదు గ్యాస్ సిలిండర్లు సీజ్


సిలిండర్లను సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం), జనవరి 17: నగర పరిధిలోని సీకేదిన్నె మండలం క్రిష్ణాపురం గ్రామం కేఎస్ఆర్ఎం కాలేజీ ఎదురుగా ఉన్న హోటల్‌ను కడప విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ షేక్ మాసూం బాషా ఆదేశాల మేరకు మంగళవారం ఆ హోటల్‌ను తనిఖీ చేయగా గృహావసరాలకు ఉపయోగించే సిలిండర్లు హోటల్‌లో వాడుతున్నట్లు గుర్తించారు. ఆ మేరకు ఐదు సిలిండర్లను సీజ్ చేసి, హోటల్ యజమాని ఎం.నరసింహారెడ్డిపై కేసు నమోదు చేశారు. హోటల్ యజమానులందరూ వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లను వాడరాదని, కమర్షియల్ సిలిండర్లను వాడాలన్నారు. లేదంటే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, బాలగంగాధర్ రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ సౌజన్య, కడప సీఎస్‌డీటీ, హెడ్‌కానిస్టేబుల్ జనార్ధన్‌రావు, హరినాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీసుల తనిఖీలు

● **భారీగా నగదు, బంగారు స్వాధీనం**


తనిఖీల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, నగదు

కడప (క్రైం), జనవరి 17: జిల్లా వ్యాప్తంగా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు బుధవారం పోలీసులు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో కడప నగరంలోని 1వ గాంధీ సర్కిల్ వద్ద వన్‌టౌన్ సీఐ సి.భాస్కర్‌రెడ్డి సిబ్బందితో తనిఖీ చేస్తుండగా పల్లా వెంకటేశ్ వద్ద ఎటువంటి బిల్లులు లేకుండా రూ.2,83,500 నగదు, 796.700 గ్రాముల బంగారు వస్తువులు తీసుకెళుతుండగా పట్టుకున్నారు. మొత్తం విలువ రూ.50,43,782లుగా నిర్ధారించారు. తిరుపతి ఆదాయపన్ను శాఖ అధికారులకు పంపారు. అలాగే నగరంలోని మునిరావు స్ట్రీట్ వద్ద తనిఖీ చేస్తుండగా నత్తి ఫారుక్‌ఖాన్ రూ.5లక్షలు, నత్తి మాబు షరీఫ్ రూ.2.50 లక్షలు ఎటువంటి బిల్లులు లేకుండా తీసుకెళుతుండగా ఆ నగదును సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, రంగస్వామి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

స్కూటీలో ఉన్న రూ.8లక్షల నగదు సీజ్

కడప నగరం రెండో గాంధీబొమ్మ వద్ద బుధవారం వన్‌టౌన్ ఎస్ఐ సంజీవరాయుడు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. కడప సాయిపేటకు చెందిన బొడ్డేచర్ల సుబ్బరాయుడు స్కూటీని తనిఖీ చేసి.. డిక్కీలో ఉన్న రూ.8లక్షల నగదును గుర్తించారు. ఆ డబ్బుకు సంబంధించిన ఎలాంటి బిల్లులు లేకపోవడం, సరైన సమాధానం చెప్పకపోవడంతో తిరుపతి ఐటీ శాఖకు అప్పగించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.14.50 లక్షల నగదు పట్టివేత


సీజ్ చేసిన నగదును చూపుతున్న టూటౌన్ సీఐ ఇబ్రహీం, సిబ్బంది

ప్రొద్దుటూరు, జనవరి 17: ప్రొద్దుటూరు పట్టణం మెయిన్ బజార్‌లో ఓవ్యక్తి సంచిలో 14.50 లక్షల నగదుతో వెళుతుండగా టూటౌన్ పోలీసులు తనిఖీల్లో పట్టుబడింది. బుధవారం టూటౌన్ పరిధిలో సీఐ ఇబ్రహీం ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. నెల్లూరు జిల్లా దుత్తలూరుకి చెందిన జయరామిరెడ్డి అనే వ్యక్తి తన కుమార్తె వివాహంకోసం ప్రొద్దుటూరులో బంగారు కొనుగోలు చేయడానికి రూ.14.50 లక్షల నగదును బ్యాగులో పెట్టుకొని మెయిన్ బజార్‌లో వెళుతుండగా పోలీసులు అనుమానంతో తనిఖీ చేశారు. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశారు. తిరుపతి ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. కాగా జయరామిరెడ్డి ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి బంధువు కావడంతో ఆయన టూటౌన్‌కు స్వయంగా వెళ్లి బిడ్డ పెళ్లి కోసం బంగారు కొనడానికి డబ్బు తీసుకెళుతుంటే సీజ్ చేయడం సరికాదని.. అతని డబ్బు అతనికి ఇవ్వాలని కోరారు. దీంతో టూటౌన్ సీఐ ఇబ్రహీం తన పరిధిలో లేదని.. ఆధారాలు చూపకుండా నగదు ఇవ్వడం కుదరదని ఎమ్మెల్యేకు తెలిపారు.

ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ సమీపంలో...

ఎర్రగుంట్ల, జనవరి 17: ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం సాయంత్రం స్పెషల్‌పార్టీ పోలీసుల తనిఖీలో రూ.4.50లక్షల నగదు, రెండు కేజీల బంగారు పట్టుబడినట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. తమిళనాడుకు చెందిన విష్ణువర్ధన్, కరుణాకర్, చక్రపాణి కలిసి బంగారు, నగదును ఎలాంటి బిల్లులు లేకుండా ప్రొద్దుటూరు నుంచి తమిళనాడుకు తీసుకెళుతుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద...

కొండాపురం, జనవరి 17 : మండలంలోని కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి పోలీసులు రూ.2 లక్షల నగదు సీజ్ చేశారు. కొండాపురం సీఐ వేణుగోపాల్, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా.. కడప నుంచి బళ్లారికి కారులో వెళుతున్న సయ్యద్ జిలాని బాషా అనే వ్యక్తి నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

జమ్మలమడుగులో...

జమ్మలమడుగు, జనవరి 17: జమ్మలమడుగులోని ఎస్ఆర్ పెట్రోలు బంకు మలుపు వద్ద బుధవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. సున్నపురాళ్లపల్లె గ్రామానికి చెందిన పి.నాగయ్య అనే వ్యక్తి ఎలాంటి రశీదులు లేకుండా రూ.1.80 లక్షలు తెస్తుండగా తనిఖీ చేసి పట్టుకున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు తప్పనిసరి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్) జనవరి 17: సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులను కల్పించాలని కలెక్టర్ విజయరామరాజు ఎన్నికల నిర్వహణ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్లో జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌తో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు(ఈఆర్వోలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన కనీస వసతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అందుకు సంబంధించి ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో 80 ఏళ్లకు పైబడిన ఓటర్లు, దివ్యాంగులను గుర్తించి, వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. నియోజకవర్గాల వారీ సెక్టార్ అధికారులను వెంటనే నియమించాలన్నారు. స్టాటిస్టిక్ సర్వెలైన్స్ టీమ్‌ను, స్క్వాడ్స్‌ను నియమించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, ఎస్డీసీలు చంద్రమౌళి, కౌసర్‌బాను, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి ప్రభాకర్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాలకు ఏర్పాట్లు

గణతంత్ర దినోత్సవాలను నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో 75వ గణతంత్ర వేడుకలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్‌లతో కలసి అన్ని శాఖల అధికారు లతో సమావేశం నిర్వహించారు. 26న స్థానిక పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో జెండా వందనానికి అవసరమైన ఏర్పాట్లు, వేదికను అందంగా అలంకరించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలు, జిల్లా అభివృద్ధికి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటి చెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని డీఆర్డీఏ, డ్వామా, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, జలవనరుల శాఖ, వ్యవసాయ, ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్ తదితరశాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యక్ర మాలను పండుగను తలపించేలా ఏర్పాట్లు చేయాలని డీఈఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కృష్ణారావు, ఆర్డీఓలు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా కార్మికులకు రక్షణ కల్పించేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో జిల్లా క్రైసిస్ గ్రూప్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని పరిశ్రమల్లో రక్షణకు పటిష్టమైన చర్యలు, చుట్టు పక్కల ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలశాఖ, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, ఫైర్‌శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని, ఆయా కంపెనీల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. 15రోజులకు ఒకసారి పరిశ్రమలను తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ తుషార్ డూడీ, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఫ్యాక్టరీస్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూ విద్యార్థికి అవార్డు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 17: రాష్ట్ర యువజనోత్సవాల్లో భాగంగా కేఎల్ యూనివర్శిటీ (విజయవాడ)లో ఈ నెల 7 నుంచి 9 వరకు యువజన సర్వీసులశాఖ ఏపీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ నిర్వహించిన యువ-2024 ఏపీ స్టేట్ యూత్ ఫెస్టివల్‌లో ఫొటోగ్రఫీ కాంపిటీషన్‌లో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ విద్యార్థి విల్సన్‌కు తృతీయ బహుమతి లభించింది. ఈ బహుమతిని కె.శారదాదేవి ఐఏఎస్ (కమిషనర్ ఆఫ్ యూత్ సర్వీసెస్ అండ్ ఎండీ, ఏపీ స్టేట్ గవర్నమెంటు ఆఫ్ ఏపీ) చేతుల మీదుగా తీసుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఏఎఫ్ఏయూ విద్యార్థికి బహుమతి రావడం పట్ల యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ ఆచార్య అంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఈసీ సురేంద్రనాధరెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫొటోగ్రఫీ కోఆర్డినేటర్ డాక్టర్ సంపత్‌కుమార్ విద్యార్థిని అభినందించారు.

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షలు విరాళం

సికెదిన్నె, జనవరి 17: బయనపల్లె అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం నిర్మాణానికి తుమ్మల పరమేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు రూ.2 లక్షలు విరాళం అందజేశారు. ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్థులంతా కలిసికట్టుగా కృషి చేస్తున్నారు.

ఈ విషయం సంక్రాంతి పండుగకులండన్‌నుంచి స్వగ్రామానికి వచ్చిన తుమ్మల పరమేశ్వర్‌రెడ్డికి తెలపడంతో ఆయన సానుకూలంగా స్పందించి రూ.2లక్షలు విరాళం చెక్కు రూపంలో అందజేశారు.

చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించినపుడే రాజ్యాధికారం

● *బీసీ ప్రజాతంత్ర చర్చా వేదికలో బీసీ నేతల వెల్లడి*


పిడికిలి బిగించి ఐక్యతా నినాదం ఇస్తున్న బీసీ నేతలు

ప్రొద్దుటూరు, జనవరి 17: బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించుకున్నప్పుడే రాజ్యాధికారం వస్తుందని రాజకీయ పార్టీలను టికెట్లు అడుక్కుంటే రావని బీసీ ప్రజా బలంతో పోరాడితేనే వస్తాయని బీసీ నేతలు వెల్లడించారు. బుధవారం స్థానిక పద్మశాలీయ కళ్యాణమండపంలో బీసీ ప్రజాతంత్ర వేదిక సమన్వయకర్త పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెన్నాసరళాదేవి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో బీసీలకు రాజ్యాధికారంలో భాగం కల్పించడంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ఒకే కులం చేతిలో రాజ్యాధికారం బందీగా వుందన్నారు. తద్వారా బీసీలు ఇతర కులాలకు ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. ఎస్సీ ఎస్టీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు వుండటం వల్ల వారికి ప్రత్యేక నియోజకవర్గాలు రిజర్వు చేయడంతో వారు రాజ్యాధికారంలో భాగం అవుతున్నారన్నారు. జనాభాలో 60 శాతం వున్న బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు రాకుండా అగ్రకుల పార్టీలు అడ్డుకుంటున్నాయన్నారు. దేశంలో బీసీ కుల గణన జరిగితే బీసీలకు 55 శాతం రిజర్వేషన్లు వస్తాయన్నారు. రాజకీయ పార్టీలకు టికెట్లు ఇవ్వమని వారి దయా దాక్షిణ్యాల మీద బీసీలు ఈ రోజు ఆధారపడుతున్నారన్నారు. ప్రొద్దుటూరులో బీసీలకు టికెట్లు కేటాయించేలా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. రాజకీయాల్లోకి రావాలంటే ప్రజాస్వామ్యంలో ఎవరికైనా సమాన ప్రాతినిధ్యం వున్నప్పటికి నేడు కోట్ల రూపాయల డబ్బులు లేకుండా రాజకీయాలు చేయలేని పరిస్థితి అన్ని పార్టీలు కల్పించాయన్నారు. భూకబ్జాలు, ఇసుక, గనులు, ఎర్రచందనం దోపిడీ, క్రికెట్ బెట్టింగ్ లాంటి వన్నీ చేస్తేనే నేడు రాజకీయాల్లో పోటీ పడగల పరిస్థితులు వచ్చాయన్నారు. ఇది మార్పుకోనంత వరకు బీసీలు రాజకీయాల్లో అగ్రవర్ణాలతో పోటీ పడలేరన్నారు. బీసీలు ప్రజాబలం నిర్మించుకుని చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించుకునేందుకు పోరాటాలకు నడుం బిగించాలన్నారు. సమావేశంలో బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేత పాణ్యం సుబ్బరాయుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, టీడీపీ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పాణ్యం సావిత్రమ్మ, సామాజికవేత్త డాక్టర్ మల్లెల భాస్కర్, సాహిత్యవేత్త జింకా సుబ్రహ్మణ్యం, న్యాయవాది గొర్రె శ్రీనివాసులు, బీసీ సమాఖ్య నేతలు శివనారాయణ, బీవీరాజు, క్రిష్ణయ్య యాదవ్, సర్పంచు జొల్లు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకే తలమానికంగా క్రికెట్ స్టేడియం అభివృద్ధి


నూతనంగా నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తున్న కలెక్టర్ పీఎస్ గిరీషా

రాయచోటిటౌన్, జనవరి 17: అన్నమయ్య జిల్లాకే తలమానికంగా రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం నక్కవాండ్లపల్లె వద్ద నూతనంగా నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తున్నామని కలెక్టక్ పీఎస్ గిరీషా అన్నారు. బుధవారం ఆయన స్టేడియంలోకి వెళ్లేందుకు రాయచోటి-సుండుపల్లె రోడ్డు నుంచి స్టేడియం వరకు ఏర్పాటు చేసిన నూతన తారురోడ్డును, దిగువ అబ్బవరంలో గల ఎంఐజీ లేఅవుట్లకు ఏర్పాటు చేసిన అప్రోజ్ రోడ్డును ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఐజీ లేఅవుట్‌లో నిర్మించకునే ఇళ్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, కమిషనర్ గంగాప్రసాద్, కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ నందన్, ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కారు ఢీకొని స్కూటరిస్టు మృతి

మైదుకూరు, జనవరి 17: ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా కారు ఢీకొన్న ప్రమాదంలో యువ రైతు మృతి చెందిన ఘటన మైదుకూరు మండలంలోని ప్రకాశ్‌నగర్ వద్ద బుధవారం రాత్రి జరిగింది. బి.మఠం మండలం లింగలదిన్నెపల్లెకు చెందిన కొండారెడ్డి (45) మైదుకూరు నుంచి ద్విచక్రవాహనంపై వెళుతుండగా ప్రకాశ్‌నగర్ వద్దకు రాగానే మైదుకూరు వైపు వస్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యా పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

విశ్రాంత ఉద్యోగులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలి

లేదంటే రానున్న ఎన్నికల్లో వైసీపీని గద్దెదించుతాం ● ధర్నాలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల డిమాండ్


నిరసన ధర్నా చేస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

కడప (మారుతీనగర్) జనవరి 17: ఆర్టీసీలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెన్షన్‌గా రూ.5వేలు ఇవ్వాలని లేని పక్షంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని గద్దె దించేందుకు విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలు సిద్ధంగా వున్నాయని వైఎస్ఆర్ ఏపీఎస్ఆర్‌టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేత రఘునాధరెడ్డి హెచ్చరించారు. 2014 సెప్టెంబరు 1కు ముందు రిటైర్డ్ అయిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు కేవలం రూ.1,000 నుంచి రూ.2,000 మాత్రమే పెన్షన్‌గా వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రూ. 5వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ కడప రీజనల్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా చేపట్టారు. ఐదేళ్లగా పెన్షన్ పెంచాలని కోరుతున్నా ఫలితం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 60వేల మంది విశ్రాంత ఉద్యోగులు వారి కుటుంబాలతో కలిసి రెండు నుంచి ఆరు లక్షల మంది ఓటర్లు వున్నారన్నారు. ఎలక్షన్ కోడ్ వచ్చే లోపల పెన్షన్ పెంచకపోతే వైసీపీకి ఓట్లేసే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో పలువురు పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిల రాకతో వైసీపీలో గుబులు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు

కడప(కలెక్టరేట్)) జనవరి 17: వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధకురాలు వైఎస్ షర్మిల రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ పగ్గాలు చేపట్టడం శుభపరిణామని, దీంతో వైసీపీలో గుబులు మొదలైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతంరెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 135 ఏళ్ల చరిత్ర కలిగిన పార్టీఅని, అలాంటి పార్టీకి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెండు పర్యాయాలు పీసీసీగా ఉన్నారని, ఆయన వారసురాలిగా వైఎస్ షర్మిల పీసీసీ పగ్గాలు చేబట్టిన మొదటి మహిళ అన్నారు. ఒక లేడీ పార్టీకి, కొత్త లేడీ అధ్యక్షురాలంటూ వైసీపీ నేతలు వ్యంగస్త్రాలు చేయడం సిగ్గు చేటన్నారు. పార్టీని, షర్మిలను విమర్శించే నేతల నోళ్లు మూయించేలా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటనుందని హెచ్చరించారు. అవాకులు, చెవాకులు మానకపోతే వచ్చే ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి చీకటి చార్లెస్, పీసీసీ డెలిగేట్ పొట్టి పాటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్యామలాదేవి, మానవ హక్కుల జిల్లా అధ్యక్షుడు పాలగిరి శివ, ఎన్ఎస్ యూఐ రాష్ట్ర నేత సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షిఫ్ట్ ఆపరేటర్ నిర్లక్ష్యం.. లైన్‌మెన్‌కు విద్యుదాఘాతం

పీలేరు, జనవరి 17: షిఫ్ట్ ఆపరేటర్ నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు జేఎల్ఎంలకు గాయాలైన సంఘటన బుధవారం పీలేరు మండలం తలపుల గ్రామంలో జరిగింది. తలపుల సచివాలయంలో కె.హరీశ్(27), ఆర్.మునిప్రసాద్(25) గ్రేడ్-2 జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. తలపుల పంచాయతీ పరిధిలోని అబ్బిరెడ్డిగారిపల్లె, మల్లేశ్వరపురం ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల సమస్యలు ఉండడంతో తలపుల సబ్-స్టేషన్‌లో ఎల్‌సీ(లైన్ క్లియర్) తీసుకుని మధ్యాహ్నం 1 గంటకు మరమ్మతులు ప్రారంభించారు. అయితే మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో సబ్-స్టేషన్‌లో విధుల్లో షిఫ్ట్ ఆపరేటర్ బాలాజీ మద్యం మత్తులో అబ్బిరెడ్డిగారిపల్లె ప్రాంతానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాడు. దీంతో లైన్‌పై పనులు చేస్తున్న హరీశ్, మునిప్రసాద్ విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయారు. ఈ విషయం గమనించిన గ్రామస్తులు హుటాహుటిన వారిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హరీశ్ పరిస్థితి విషమంగా ఉండడంతోం వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. మునిప్రసాద్ పరిస్థితి మెరుగ్గా ఉండడంతో పీలేరులో చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనను ట్రాన్స్‌కో అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. పీలేరు ఈఈ మునిచంద్ర సంఘటనా స్థలంతోపాటు తలపుల సబ్-స్టేషన్‌ను పరిశీలించారు. ఈఈ వచ్చిన విషయం తెలుసుకున్న స్థానికులు బాలాజీని సస్పెండ్ చేయాలని కోరుతూ సబ్-స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఢిల్లీలో పోరాటం


వాల్మీక సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

మదనపల్లె అర్బన్, జనవరి 17: ఎస్టీ రిజర్వేషన్ కోసం ఢిల్లీలో పోరాడనున్నట్లు వాల్మీకిసంఘం నాయకులు తెలిపారు. బుధవారం ఏపీ రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు గంపల గంగురాజు, జాతీయ కార్యదర్శి మక్కినేని వేణుగోపాల్, ఏపీ రాష్ట్ర అధ్య క్షుడు మేకల విజయమోహన్, రాష్ట్ర కార్యదర్శి పూలకుంట్ల హరిబాబు, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు టేకుపల్లి శ్రీనివాసులు సమావేశంలో పాల్గొని నూతన కమిటీని ఎంపిక చేశారు. జాతీయ కార్యదర్శిగా మక్కినేని వేణుగోపాల్, సౌంత్ ఇండియా జాయింట్ సెక్రటరీలుగా కొత్త ఉడుముశంకర, అరవి లక్ష్మీనారాయణ, రాయలసీమ జాయింట్ సెక్రటరీ చెన్నం శ్రీరాములు, రాయలసీమ అధికార ప్రతినిధి నందకుమార్, రాయలసీమ సెక్రటరీ చెన్నవ నాగరాజ, జిల్లా సెక్రటరీ చెన్నం శశిధరబాబు, జిల్లా అధికార ప్రతినిధిగా తలారి కృష్ణప్ప, జిల్లా యూత్ ప్రెసి డెంట్ సాకే శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బాలే శ్రీనివాసులను ఎన్నుకుని నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా గంగప్పల గంగరాజు, విజయ మోహన్ మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం తమ లక్ష్యమన్నారు. ప్రస్తుతం గల్లీ నుంచి ఢిల్లీకి పోరాటం చేరుకుందని తెలిపారు.



ప్రజా సమస్యలపై ప్రధాని మోదీని కలిసి మాట్లాడుతున్న పోతుగుంట రమేశ్‌నాయుడు

సంక్రాంతి క్రికెట్ విన్నర్ కేసీ పల్లె జట్టు



క్రికెట్ విన్నర్‌కు రూ.లక్ష బహుమతి ఇస్తున్న గిరీశ్‌రెడ్డి

పెనగలూరు, జనవరి 17: మండల కేంద్రమైన పెనగలూరు ఉన్నత పాఠశాల మైదానంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తలమంచి గిరీశ్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన క్రికెట్ పోటీల్లో బుధవారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కోడిచెన్నగారిపల్లె జట్టు విన్నర్‌గా నిలిచింది. ఈ జట్టుకు ట్రస్ట్ చైర్మన్ తలమంచి గిరీశ్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు తలమంచి చంద్రభానురెడ్డి, తలమంచి ధనుంజయరెడ్డి రూ.లక్ష నగదు బహుమతిని ఇచ్చారు. అలాగే రన్నర్ జట్టు రైల్వేకోడూరుకు చెందిన జేవీఆర్ లెవన్ జట్టు రూ.50 వేలు ఇచ్చారు. ఇదిలా ఉండగా వాలీబాల్ విన్నర్‌గా పెనగలూరు జట్టుకు రూ.10 వేల నగదు బహుమతిని ఇచ్చారు. కార్యక్రమంలో గిరీశ్‌రెడ్డి కుటుంబ సభ్యులు తలమంచి పవన్‌కుమార్‌రెడ్డి, మెట్టా సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా



ఇంద్రకుమార్‌రాజును సత్కరిస్తున్న ఆలయ కమిటీ నాయకులు

నందలూరు,జనవరి 17: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని కోదండరామాలయ అభివృద్ధికి తన వంతు ఆర్థికసాయం అందిస్తానని తిరుపతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చేజర్ల ఇంద్ర కుమార్ రాజు అన్నారు. ఈ సందర్భంగా రూ.2 లక్షల విరాళాన్ని ఆయన ప్రకటించారు. బుధవారం నందలూరులో ఒక కార్యక్రమానికి విచ్చేసిన ఆయనను ఎన్ఆర్ఐ ఆకుల చలపతి గుడికి ఆహ్వానించడంతో ఆలయాన్ని సందర్శించారు. ఆయనను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల్లో నగదు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు సుధాకర్, డాక్టర్ అరిగె రాంప్రసాద్, నడివీధి సుధాకర్, పల్లె నాగయ్య, వేణు, మహేష్, విశ్రాంత ఉపాధ్యాయుడు నరసింహరావు, నారపుశెట్టి శివ, దుష్యంత్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్యక్రమంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె,జనవరి 17: ఐకార్, ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా 'పుట్టగొడుగుల పెంపకంతో ఉపాధి అవకాశాలపై' వై.కోట గ్రామ పంచాయతీలో హార్టికల్చర్ అధికారులు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలంలోని వై.కోట గ్రామ పంచాయతీ తిరుగుడుపల్లెలో పుట్టగొడుగులకు విలువ ఆధారిత ఉత్పత్తి జోడించడం ద్వారా గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఉద్యానవన శాఖాధికారులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరాజ్యలక్ష్మీ, డాక్టర్ సీహెచ్ రూత్, ఉద్యానవన శాఖ విద్యార్థులు గ్రామీణ మహిళలు వెంకటలక్ష్మీ, గంగమ్మ, వీరనాగమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

ఆమరణ నిరాహార దీక్షలకైనా సిద్ధం

- 37వ రోజు రాయచోటి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల నిరసన



లక్కిరెడ్డిపల్లెలో ప్రసంగిస్తున్న అంగన్వాడీల జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు

రాయచోటిటౌన్, జనవరి 17: అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలకైనా సిద్ధంగా ఉన్నామని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కన్వీనర్ నాగేశ్వరి అన్నారు. అంగన్వాడీల సమ్మెలో భాగంగా 37వ రోజు రాయచోటి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు నిరసన వ్యక్తం చేసి ఐసీడీస్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత 37 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు రోడ్లపైకి వచ్చి వివిధ రకాల నిరసనలు చేస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అంగన్వాడీ వర్కర్ అండర్ హెల్పర్స్ యూనియన్ లీడర్లు సుజాత, సంధ్య రజిని, వీరబల్లి భారతి, తులసి, దుర్గ, విజయకుమారి, రేణుక, స్వర్ణకుమారి, పద్మావతమ్మ, రామతులసమ్మ, అంగన్వాడీవర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: నిరంకుశ నిర్బంధాలతో ఉద్యమాలను, పోరాటాలను ప్రభుత్వం ఆపలేదని సీఐటీయూ జిల్లా ట్రెజరర్ హరీశర్మ పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లె మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన 37వ రోజు సమ్మె కార్యక్రమాన్ని సీఐటీయూ జిల్లా ట్రెజరర్ హరిశర్మ, అంగన్వాడీ జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్టీయూ సంఘాలు కలుపుకొని ప్రతి రోజు నిరవధిక నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి, కార్యదర్శి ఓబులమ్మ, సెక్టారు లీడర్లు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను వెంటనే ప్రభుత్వం పరిష్కారం చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు రాధాక్రిష్ణలు డిమాండ్ చేశారు. బుధవారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు.

అనంతరం తిరుపతి జిల్లా సీపీఎం నేత శివానంద్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీలపై చిన్నచూపు చూస్తోందని, సీఎం తన పాదయాత్రలో తెలంగాణ కంటే ఎక్కువగా జీతాలు పెంచుతామని చెప్పి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, అంగన్వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మీ, రైల్వేకోడూరు ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు రమాదేవి, పద్మ, లీలా, శిరీషా పాల్గొన్నారు.

అనంతరం ఐసీడీఎస్ కార్యాలయం సమీపం నుంచి బస్టాండు వరకు జిల్లా అంగన్వాడీ సంఘం అధ్యక్షురాలు శ్రీలక్ష్మీ, రైల్వేకోడూరు ప్రాజెక్టు సంఘం అధ్యక్షురాలు రమాదేవిల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, రైల్వేకోడూరు నియోజకవర్గ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మైనార్టీలు



కాంగ్రెస్‌లో చేరుతున్న పలు కుటుంబాలు

రైల్వేకోడూరు, జనవరి 17: పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లాబకాష్ సమక్షంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు చెందిన పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రైల్వేకోడూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గోశాలదేవి మాట్లాడుతూ పీసీసీ పగ్గాలు చేపట్టిన షర్మిల రాష్ట్రంలో నూతన ఒరవడి సృష్టిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ అఫ్రీన్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్య, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండల అధ్యక్షుడు రమేష్, హరిక్రిష్టారెడ్డి, మదనపల్లె మండల అధ్యక్షుడు అమీర్, ముస్లిం నాయకులు హఫీజ్, మక్బుల్, జబీబుల్లా పాల్గొన్నారు.

నేడు టీడీపీలో చేరుతున్నా

- ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె, జనవరి 17: 'నేను గురువారం విజయవాడలో చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరుతున్నా' అని ప్రముఖ పారిశ్రామికవేత్త ముక్కా రూపానందరెడ్డి అన్నారు. ఆయన బుధవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఇటీవల పార్టీ అధినేత చంద్రబాబునాయుడును పలుమార్లు కలిశానన్నారు. ఆయన సూచనల మేరకు నియోజకవర్గంలో టీడీపీ రూపురేఖలు మార్చుతానని, పార్టీని బలోపేతం చేస్తానన్నారు. కాగా బుధవారం ఆయన భారీ కాన్వాయ్‌తో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

పార్కును పట్టించుకోరా ?

గాలివీడు, జనవరి 17: మండలంలోని వెలిగల్లు ప్రాజెక్టు సమీపంలోని పార్కును ఏ మాత్రం పట్టించుకోలేదని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం సీపీఐ నాయకులతో కలిసి పార్కు పరిసరాలను ఆయన పరిశీలించారు. వారు మాట్లాడుతూ నిత్యం పార్కుకు వచ్చే సందర్శకులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి వెలిగల్లు పార్కులో పరిశుభ్రతతో పాటు మంచి వాతావరణం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు యుగంధర్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి పురం కృష్ణమూర్తి, ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్తీక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన జాతర

రామాపురం, జనవరి 17: మండలంలోని గోపగుడిపల్లె కస్బాలో బుధవారం గుండు గంగమ్మ, గౌరమ్మ తల్లుల జాతర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ జాతర సందర్భంగా గ్రామంలోని ప్రతిఒక్కరూ ఉదయం నుంచి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మొక్కుబడి ఉన్న వారు గుండు గంగమ్మ తల్లికి బోనాలు పెట్టారు. ఈ జాతర పూర్వం పెద్దల కాలం నుంచి సంప్రదాయబద్ధంగా కనుమ రోజున నిర్వహిస్తారని ఆలయ కార్యనిర్వాహకులు బలరామయ్య తెలిపారు. అనంతరం గౌరమ్మ విగ్రహాన్ని ఊరేగించారు. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడలు.. క్రీడాకారుల ప్రతిభకు గుర్తింపు



ట్రోఫీతో విన్నర్స్ టీంలో పాల్గొన్న నాయకులు

సంబేపల్లె, జనవరి 17: గ్రామీణ ప్రాంతంలో క్రీడలు క్రీడాకారుల ప్రతిభకు గుర్తింపుని స్తుందని రాయచోటి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రమేశ్ కుమార్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, రాయచోటి టీడీపీ నాయకుడు సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. బుధవారం దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లెలో టీడీపీ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన టీ10 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. టీ10 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విన్నర్స్‌గా ఉరగాయగుట్ట క్రీడాకారులు గెలుపొందారు. రన్నర్స్‌గా పెద్దజంగపల్లె క్రీడాకారులు నిలిచారు. స్థానిక నాయకులు మాజీ ఎంపీపీ మల్లు నరసారెడ్డి, దుద్యాల రమేశ్‌రెడ్డి, సాధు జయచంద్రారెడ్డి, రవీంద్రారెడ్డి, దుద్యాల సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవి, చిన్నప్ప, మురికినాటి వెంకట సుబ్బారెడ్డి, జంగం సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్రమణలు హాజరయ్యారు. గ్రామస్తులు నాయకులకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం గెలుపొందిన విన్నర్స్ క్రీడాకారులకు జ్ఞాపకతో పాటు రూ.30 వేలు నగదును అందజేశారు. రన్నర్స్‌గా నిలిచిన క్రీడాకారులకు రూ.15 వేలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సహదేవ, శివప్రసాద్, ఆంజనేయులు, మణికంఠ, రమణయ్య, ప్రసాద్, సోమశేఖర్, పలువురు యువత పాల్గొన్నారు.

ప్రసాద్‌బాబును కలిసిన టీడీపీ నాయకులు

రాయచోటిటౌన్, జనవరి 17: రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రసాద్‌బాబును చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమల మండల టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరిప్రసాద్‌నాయుడు, బాలకృష్ణ నాయుడు, రామకృష్ణనాయుడు, రమణయ్య, వేణుగోపాల్‌నాయుడు, శంకర్, విశ్వనాథం, మల్లికార్జున, చిన్నబాబు, మండల మాజీ ఉపాధ్యక్షులు రఫీ, శంకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విజయవాడ సభకు తరలిన టీడీపీ నేతలు



భారీ కాన్వాయ్‌తో తరలివెళ్తున్న కస్తూరి

రైల్వేకోడూరు, జనవరి 17: తెలుగుదేశం పిలుస్తోంది రా.. కదిలిరా.. అనే కార్యక్రమానికి బుధవారం రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో రైల్వేకోడూరు, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు, ఓబులవారిపల్లె మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నిర్వహించే సభలకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి వైసీపీకి గుండెల్లో దడ పుట్టిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, రాష్ట్ర బీసీ నాయకుడు నాయిడోరి రమణ, కేజేపీ రెడ్డయ్యనాయుడు, కల్లా చలపతి, జి.వెంకటేశ్వరరాజు, రవివర్మ, రవిరాజు, గునిపాటి చెన్నరాయుడు, అనుముల గుండం చంద్రమోహన్, చిట్వేలి మండల పార్టీ అధ్యక్షుడు కేకే చౌదరి తదితరులు వెళ్లారు.

చిట్వేలి: రాష్ట్రాన్ని ప్రజలను పట్టిపీడిస్తున్న రాక్షస పాలనకు శుభం కార్డు పడిపోతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు 'తెలుగుదేశం పిలుస్తోంది రా.. కదలిరా' కార్యక్రమంలో భాగంగా కస్తూరి విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో చిట్వేలి నుంచి భారీ వాహనాల్లో కార్యకర్తలతో కలిసి విజయవాడకు తరలివెళ్లారు. ఈ మేరకు బుధవారం చిట్వేలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వేశ్వరనాయుడు, మండల అధ్యక్షుడు కె.కె.చౌదరి, అనంతయ్య యాదవ్, అనిత దీప్తి, కట్టా లోకేష్, శ్రీధర్, రాజా, గుండయ్య యాదవ్, లాయర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ తీరు ముమ్మాటికీ తప్పే : చమర్తి



విలేకర్లతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జనవరి 17: చంద్రబాబు అరెస్టుపై వైసీపీ ప్రభుత్వ తీరు ముమ్మాటికి తప్పేనని టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన సెక్షన్ 17ఏ అవినీతి నిరోధక చట్టం 1988 ఈ కేసుకు వర్తిస్తుందా.. లేదా అని న్యాయమూర్తుల విభిన్న అభిప్రాయాలను వెలిబుచ్చారని, అనంతరం చర్యల కోసం అత్యున్నత న్యాయమూర్తికి సీజేఐ నివేదించారన్నారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అవగాహన లేకుండా ప్రతిపక్ష నాయకుడి హోదా కలిగిన వ్యక్తిని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు కార్యనిర్వహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు సతీష్‌రాజు, సీనియర్ నాయకులు నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు శివకుమార్ పాల్గొన్నారు.



రూ.13.8 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జికి భూమిపూజ

వీరబల్లి, జనవరి 17: మండలంలోని గడికోట గ్రామ పంచాయతీలోని పెద్దూరు వద్ద మాండవ్యనదిపై రూ.13.8 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మించుటకు బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి రాజపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఉమ్మడి జిల్లాల జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్, మాజీ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డిలు భూమిపూజ నిర్వహించారు. వీరితో పాటు స్థానిక ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గ వైసీపీ నాయకులు గాలివీటి మదన్‌రెడ్డి, మండల యువ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు నదిపై బ్రిడ్జి లేక వర్షాలు వస్తే చాలా ఇబ్బందులకు గురవుతూ ఉండేవారని, నేటితో గడికోట ప్రజల కల నెరవేరనుందన్నారు. నాగార్జునరెడ్డి తన సొంత ఊరు కావడంతో ఉన్నత స్థాయి అధికారులు, రాజకీయ నాయకులతో చర్చించి ఈ హైలెవెల్ బ్రిడ్జిని తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండలంలోని వైసీపీ నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి పనిచేయండి

- అమరావతి జేఏసీ కన్వీనర్ శ్రీనివాసరావు

సంబేపల్లె, జనవరి 17: రాబోయే ఎన్నికల్లో ఏపీ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని అమరావతి జేఏసీ కన్వీనర్ శ్రీనివాసరావు తెలియజేశారు. మంగళవారం రాత్రి గుట్టపల్లె గ్రామం బట్టావాండ్లపల్లె సమీపంలోని జీఎండీ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాయచోటి టీడీపీ ఇన్‌చార్జి రమేశ్‌కుమార్‌రెడ్డి, రాజంపేట నేత సుగవాసి బాలసుబ్రమణ్యం, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ప్రసాద్‌బాబు హాజరయ్యారు. అనంతరం గుది ఫౌండేషన్ చైర్మన్ మారుతీ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు నరసారెడ్డి, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్యయాదవ్, గుట్టపల్లి నాయకులు వేణుగోపాల్‌నాయుడు, ప్రతాప్‌నాయుడు పాల్గొన్నారు.

సుండుపల్లె: టీడీపీ అధినేత చంద్రబాబు సారథ్యంలో జరిగే రా కదలిరా మహాసభకు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు భగవాన్ సహాయరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాల నుంచి రాష్ట్ర ప్రజలను విముక్తి చేసేందుకు సీఎంగా చంద్రబాబును గెలిపించుకోవాలని కోరారు. పార్టీ కార్యకర్తలు విరివిగా పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా గొబ్బెమ్మ నిమజ్జనం



అమ్మవారిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న గ్రామస్తులు

రైల్వేకోడూరు, జనవరి 17: మండలంలో గత 15 రోజులుగా ప్రతి వీధిలోనూ గొబ్బెమ్మను పెట్టి కోలాటాలు, ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం గొబ్బెమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. మహిళలు కోలాటాలు వేస్తూ మెరవణి చేశారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు, చిన్న పిల్లలు తదితరులు భారీగా నిమజ్జన కార్యక్రమానికి తరలివెళ్లారు.

వేడుకగా గొబ్బెమ్మ సంబరాలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

చిట్వేలి, జనవరి 17: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కొలువుదీరిన గొబ్బెమ్మ సంబరాలు వేడుక ప్రతి గ్రామంలో నిర్వహించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం చిట్వేలి మేదరవీధి నందు కోలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలో విజేతలతో పాటు పాల్గొన్న వారందరికీ స్థానిక నాయకులు ఎల్.వి.మోహన్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, దుగ్గిరెడ్డి గంగాధర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మేదర నాయకులు కొలె సుబ్రమణ్యం, వాసం నరసింహులు పాల్గొన్నారు.

సిద్దవటం: మండల కేంద్రమైన ఎగువపేట చెంచులక్ష్మీ యానాది కాలనీలో ఉన్న గౌరమ్మ అమ్మవారిని కాలనీ వాసులు, జనసేన రాజంపేట నియోజకవర్గ నాయకుడు అతికారి కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గౌరీదేవి అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసుకొని భక్తిశ్రద్ధలతో మూడు రోజుల పాటు కాలనీ వాసులు ఆనవాయితీ ప్రకారం పూజలు చేశారు. అనంతరం బుధవారం సాయంత్రం అమ్మవారిని పెన్నానదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకుడు మహబూబ్‌బాషా(బాబి), విజయ్, ఆరిఫ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: సంక్రాంతి పండుగ కనుమ సంబరాల్లో భాగంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు పలు గ్రామాల్లో గొబ్బెమ్మ సంబరాలు కన్నుల పండువగా జరిగాయి. చాలా గ్రామాల్లో మహిళలు గౌరీదేవి వ్రతాన్ని నిర్వహించి రకరకాల జానపద గొబ్బెమ్మ పాటలు పాడారు. పాటలకనుగుణంగా చప్పట్లు తడుతూ నృత్యం చేశారు. కొన్ని గ్రామాల్లో గొబ్బెమ్మ పాటలతో పాటు చెక్క భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్ధరాత్రి దాటినప్పటి నుంచి తెల్లవారుజాము వరకు నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

సుండుపల్లె, జనవరి 17: నేటి యువత శ్రీకృష్ణ దేవరాయలును ఆదర్శంగా తీసుకోవాలని జనసేన నాయకుడు రామశ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీకృష్ణ దేవరాయలు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి దామోదర్‌నాయుడు, టీడీపీ మైనార్టీ నాయకులు చాంద్‌బాషా, పూజారి వెంకటయ్య, కృష్ణయ్య, గ్రామ అధ్యక్షుడు సుబ్బరామ్, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి యువకుడు రక్తదానం చేయాలి

- సంఘ సేవకుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్



శివాలయంలో రక్తదానం చేస్తున్న యువకులు

సుండుపల్లె, జనవరి 17: యువకులు స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని రక్తదానం చేయాలని సంఘ సేవకుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్ తెలిపారు. మండలంలోని తిమ్మసముద్రం శివాలయంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 30 మంది యువకులు రక్తదానం చేసినట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ సేవకుడు కత్తి రమేశ్, ఈశ్వరయ్య, అశోక్, ముబారక్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో కలిసి ఉన్న విద్యార్థులు

ఒంటిమిట్ట, జనవరి 17: స్థానిక ఒంటిమిట్ట జడ్పీ హైస్కూల్‌లో 1989-20 సంవత్సర విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అప్పటి విద్యార్థులతో పాటు విద్య నేర్పిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 35 ఏళ్ల అనంతరం ఒకరినొకరు కలుసుకోవడం ఆనందదాయకంగా ఉందని, యోగక్షేమాలను కుటుంబీకుల ద్వారా తన స్నేహితుల ద్వారా ఒకరినొకరు తెలుసుకున్నారు. అనంతరం ఉదయం నుంచి ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరం విందు కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమంలో విద్యార్థులు సీపీఎం రమణ, కాంట్రాక్టర్ ఎస్.పి. రమణ, రాంప్రసాద్, ఉపాధ్యాయులు పుల్లారెడ్డి, నాగమునిరెడ్డి, నారాయణరెడ్డి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలు, దాడులపై కేసుల నమోదు

పలమనేరు, జనవరి17: 'కాఫీలో మత్తుమందు ఇచ్చి తనను నగ్నంగా ఉంచి, ఆపై మరో యువకుడిని తనపక్కన పడుకోపెట్టి ఫొటోలు తీసి అభిలాష అనే మహిళ తనను బ్లాక్ మెయిల్ చేస్తోంది' అని బాధితురాలు పలమనేరు పోలీసులకు ఈనెల 16వ తేది ఫిర్యాదు చేసింది. ఇద్దరు మహిళల మధ్య జరిగిన డబ్బు లావాదేవీలు చివరకు దాడులకు దారి తీసిన ఘటనపై పలమనేరు పోలీసులు ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. పలమనేరు అయ్యాక ట్టువీధిలో కాపురముంటున్న అభిలాష వస్త్రవ్యాపారం చేస్తూ పట్టణ సమీపంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు రూ. 15 లక్షలు వేరేవారి వద్ద అప్పుగా తీసి ఇచ్చింది. ఈ మొత్తం వసూలు చేసే సందర్భంగా ఆ మహిళ ఈనెల 15 వతేది కొంత మందితో వచ్చి అభిలాషపై దాడిచేసింది. దీనిపై అభిలాష పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ మహిళతో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఆ మహిళ కూడా పోలీసులకు ఫిర్యాదు చేస్తూ.. తాను చీరల వ్యాపారం చేస్తున్న అభిలాష ఇంటికి ఏడాది క్రితం వెళ్లినప్పుడు కాఫీలో మత్తుమందు ఇచ్చితనను నగ్నంగా ఫొటోలు తీసి బ్లాక్ మెయిల్ చేస్తోందని పేర్కొన్నారు. ఈమె ఫిర్యాదు మేరకు అభిలాష, గణేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. ఈ కేసులో ఎవరు చెబుతున్నది వాస్తవమో పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

పంటలపై కొనసాగిన గజదాడులు




కొబ్బరిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు - గుడిసెను కూల్చివేసిన ఏనుగులు

కల్లూరు, జనవరి 17: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీలోని పంటలపై మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు దాడులు చేయడంతో మామిడి, కొబ్బరి, అరటి తదితర పంటలకు అపారనష్టం వాటిల్లింది. కోటపల్లెకు చెందిన రైతు నరేష్ పొలంలోని కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. మామిడిచెట్లు, అరటిపంటను ధ్వంసం చేశాయి. పొలం వద్ద గుడిసెను నేలమట్టం చేశాయి. జూపల్లెకు చెందిన సుబ్బరత్న పొలంలోని మామిడి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. జూపల్లెకు చెందిన మునస్వామి, రవి తదితర రైతుల భూముల్లో సంచరించిన ఏనుగుల గుంపు మామిడిచెట్లను, బోరు మోటారును ధ్వంసం చేశాయి.

ఒంటరి ఏనుగు స్వైర విహారం



గట్టువారిపల్లె సమీపంలో ఏనుగుల దాడితో ధ్వంసమైన పంటలు

సోమల: సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీ పరిధిలోని పొలాల్లో మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు సంచరించి పలు పంటలను ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు. గట్టువారిపల్లెకు చెందిన మునిరాజ, సోమశేఖర్ చెరుకు తోట, నాగమ్మకు చెందిన డ్రిప్ పరికరాలను ధ్వంసం చేసింది. రైతులు నరసింహులు, సీతారాంలకు చెందిన కొబ్బరి, అరటి చెట్లలో తిరగాడి నష్టపరిచినట్లు వాపోయారు. పంటలను తొక్కివేసి టమోటాలకు ఊతంగా నాటిన కర్రలను నాశనం చేశాయి.

స్థానిక సంస్థలకు రూ.19.07 కోట్లు

● 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 17: స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. జిల్లా పరిషత్తుకు రూ.5,26,39,470, మండల పరిషత్తులకు రూ.2,29,63,741, గ్రామ పంచాయతీలకు రూ.11,52,29,049 విడుదలయ్యాయి. పంచాయతీల్లో మండలాలవారీగా బైరెడ్డిపల్లెకు రూ.46.94 లక్షలు, బంగారుపాళ్యంకు రూ.57.19 లక్షలు, చిత్తూరుకు రూ.22.64 లక్షలు, చౌడేపల్లెకి రూ.33.39 లక్షలు, గంగాధరనెల్లూరుకు రూ.54.17 లక్షలు, గంగవరానికి రూ.43.97లక్షలు, గుడిపాలకు రూ.32.63 లక్షలు, గుడుపల్లెకు రూ.37.79లక్షలు, ఐరాలకు రూ.39.63 లక్షలు, కార్వేటినగరానికి రూ.36.74 లక్షలు, కుప్పానికి రూ.53.91 లక్షలు, నగరికి రూ.24.28 లక్షలు, నింద్రకు రూ.22.84 లక్షలు, పలమనేరుకు రూ.23.33లక్షలు, పాలసముద్రంకు రూ.19.11లక్షలు, పెద్దపంజాణికి రూ.48.17లక్షలు, పెనుమూరుకు రూ.27.16 లక్షలు, పులిచెర్లకు రూ.29.16 లక్షలు, పుంగనూరుకు రూ.45.08 లక్షలు, పూతలపట్టుకు రూ.35.68, రామకుప్పంకు రూ.44.46 లక్షలు, రొంపిచెర్లకు రూ.16.89 లక్షలు, శ్రీరంగరాజపురానికి రూ.30.50 లక్షలు, శాంతిపురంకు రూ.48.18 లక్షలు, సదుంకు రూ.35.36 లక్షలు, సోమలకు రూ.35.75 లక్షలు, తవణంపల్లికి రూ.42.64 వి.కోటకు రూ.68.04 లక్షలు, వెదురుకుప్పానికి రూ.37.93 లక్షలు, విజయపురానికి రూ.24.11 లక్షలు, యాదమరికి రూ.36.46 లక్షలను ఆయా ఖాతాలకు జమచేశారు.

మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 17: మామిడి పూత దశలో ఉన్న కారణంగా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి బుధవారం సూచించారు. సస్య రక్షణ చర్యలతోనే నిర్ణీత మోతాదులో మందులు పిచికారి చేయడం ద్వారా తేనె మంచు, తామర వంటి చీడపీడలు, తెగుళ్ల నుంచి మామిడిని కాపాడుకోవచ్చన్నారు.

108లో కాన్పు

ఆడబిడ్డకు జన్మనిచ్చిన తల్లి



108లో ప్రసవించిన సుజాత

గుడిపాల, జనవరి 17: గుడిపాల మండలం చిత్తపార గ్రామానికి చెందిన రాజశేఖర్ భార్య సుజాత మంగళవారం అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, స్పందించిన 108 అంబులెన్స్ సమయానికి చేరుకుని చిత్తూరు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శివకుమార్ అత్యవసర వైద్యం అందించగా, సుజాత అంబులెన్స్‌లోనే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ సురక్షితంగా వున్నారని టెక్నీషియన్ శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కాజేసిన సర్పంచుల నిధులను ఇప్పించండి



కేంద్రమంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న సుబ్బరామయ్య

తిరుపతి(కొర్లగుంట), జనవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం కాజేసిన రూ.9,229 కోట్ల సర్పంచుల నిధులను ఇప్పించాలని కేంద్ర మంత్రి కపిల్ మోరేశ్వర్‌పాటిల్‌కు పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య వినతి పత్రం సమర్పించారు. బుధవారం రాత్రి కేంద్ర మంత్రి శ్రీవారి దర్శనార్థం వచ్చిన సందర్భంగా నంది కూడలి వద్ద బీజేపీ నేత గుండాల గోపినాథ్ రెడ్డితో కలిసి ఆయన స్వాగతం పలికి, సత్కరించారు. సుబ్బరామయ్య మాట్లాడుతూ నిధుల దారి మళ్లింపు నేపథ్యంలో గతేడాది ఆగస్టు 2న ఢిల్లీలో కలిశామని, ఇంతవరకు ఎలాంటి స్పందనా లేదని తెలిపారు. తాజాగా నాలుగు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.985కోట్ల నిధుల్లోనూ రూ. 600కోట్లు నిలుపుదల చేసినట్లు వివరించారు. తమ నిధులు ఎలాగైనా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ధనంజయయాదవ్, మురళి, కిరణ్‌యాదవ్, రమేష్‌నాయుడు, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.46 కోట్లు

తిరుమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.46 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 73,016 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,915 మంది తలనీలాలు సమర్పించారు.




బ్రాహ్మణపల్లె జల్లికట్టులో పశువులను నిలువరిస్తున్న యువకులు - అల్లిలో వదలడానికి గిత్తను తీసుకెళుతున్న యువకులు

కోలాహలంగా జల్లికట్టు

● బ్రాహ్మణపల్లెలో ఎటు చూసినా జనమే

వెదురుకుప్పం, జనవరి 17: ముక్కనుమ సందర్భంగా బుధవారం వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లె, కురివికుప్పం గ్రామాల్లో జల్లికట్టు నిర్వహించారు. బ్రాహ్మణపల్లె జల్లికట్టుకు వేలాదిగా జనం తరలి రావడంతో గ్రామం.. జనసంద్రంగా మారింది. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రైతులు పశువులను బ్రాహ్మణపల్లెకు తీసుకొచ్చారు. ఆయా గిత్తల కొమ్ములకు బహుమతులుగా ఉపయోగించే పట్టీలను కట్టారు. కొన్నింటికి వస్త్రాలను కప్పి వదిలారు. కొందరు ప్రధాన పార్టీల జెండాలనూ కట్టారు. ఇలా.. అల్లిలో వదిలిన పశువులను ఆపేందుకు యువకులు ప్రయత్నించారు. జనసమూహాన్ని చీల్చుకుంటూ గిత్తలు ముందుకు దూసుకు వెళ్లడంతో వాటిని ఆపే ప్రయత్నంలో యువకులు వాటి కింద పడి కొందరు గాయపడ్డారు. పట్టీలను సొంతం చేసుకునే క్రమంలో గిత్తలతో కుస్తీ పడ్డారు. కొందరు యువకులు పట్టీలను సొంతం చేసుకోగా.. మరి కొన్ని గిత్తలు వీరికి దొరకలేదు.



ఎద్దులను నిలువరిస్తున్న యువకులు

ఎర్రమట్టిపల్లిలో..

పెనుమూరు: పెనుమూరు మండలం ఎర్రమట్టిపల్లిలో బుధవారం జల్లికట్టు నిర్వహించారు. వీధుల్లో పశువులను పరిగెత్తించారు. వాటిని నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ జల్లికట్టును తిలకించేందుకు చుట్టుపక్కల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున గ్రామానికి తరలివచ్చారు.

కురివికుప్పంలో..

కురివికుప్పంలోనూ జల్లికట్టు నిర్వహించారు. అల్లిలో వదిలిన కోడెగిత్తలను నిలువరించి, బహుమతులను చేజిక్కించుకునేందుకు యువకులు ప్రయత్నించారు. ఈ క్రమంలో పలువురు గాయిపపడ్డారు. ఎగువ పాతగుంటకు చెందిన 55 ఏళ్ల వ్యక్తిని గిత్త పొడవడంతో అస్వస్థతకు గురైనట్లు స్థానికులు తెలిపారు. ఆయన అపస్మారక స్థితికి చేరుకోగా.. చికిత్స నిమిత్తం తిరుపతికి బంధువులు తరలించారు. పట్టీలు దక్కించుకున్న యువకులు సంతోషంగా వెనుతిరిగారు.




కురివికుప్పం జల్లికట్టులో పశువులను పట్టేసిన యువకులు

హైవే విస్తరణకు బ్లాస్టింగ్

● రాయిపడి బిహారు యువకుడి దుర్మరణం

● పేలుళ్లలో జాగ్రత్తగా ఉండటంలేదంటూ స్థానికుల విమర్శ




మృతిచెందిన బిహార్ యువకుడు - అరుళ్‌పురం, మోపతికన్నికాపురం వద్ద రాయిని పేల్చిన ప్రదేశం

గుడిపాల, జనవరి 17: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కొండను పేల్చడానికి అధికారులు పేల్చారు. ఈ పేలుడు ధాటికి రాళ్లు వచ్చి పైన పడడంతో బిహారుకు చెందిన యువకుడు మృతిచెందారు. గుడిపాల మండలంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు- వేలూరు, వేలూరు- చిత్తూరు జాతీయ రహదారిలోని మోపతికన్నికాపురం, అరుళ్‌పురం సమీపంలో ఆరులేన్ల రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా గుట్టను చదునుచేసే ప్రయత్నంలో రాళ్లు పేల్చడానికి బ్లాస్టింగ్ చేశారు. ఈ పేలుడు తీవ్రతకు రాళ్లు ఎగిరి వచ్చి.. రోడ్డుపై అటుగా ఎవరైనా వస్తే ఆపేందుకు ఉన్న బిహారుకు చెందిన కూలీ మొహమ్మద్ ఇర్షాద్ రాజా (23)పై పడ్డాయి. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. పేలుడు పదార్థాలను పెట్టే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో హైవే అధికారులు, కాంట్రాక్టరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. మృతదేహాన్ని తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

● కాగా, వారం రోజుల కిందట వసంతాపురం పంచాయతీ పశుమంద ఎస్టీ కాలనీలో రోడ్డు వెడల్పులో భాగంగా రాళ్లు పేల్చడానికి సిద్ధంచేయగా, అవి అకస్మాత్తుగా పేలడంలో ఇళ్లపై పడి గోడలు దెబ్బతిన్నాయి. ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. దీనిపై స్థానికుల ఫిర్యాదుతో హైవే అధికారులను ఎస్ఐ రామ్మోహన్ పిలిపించి.. పేలుడు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే బుధవారం నాటి ఘటన చోటుచేసుకుందన్న విమర్శలు వచ్చాయి.

తప్పుల్లేని తుది ఓటరు జాబితా సిద్ధం చేయండి

● అధికారులకు టీడీపీ నేతల అభ్యర్థన

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 17: 'మృతుల పేర్లు తొలగించాలని, అధికార పార్టీ నమోదు చేసిన వేలాది దొంగఓట్లు రద్దుచేయాలని కోరుతూ గతంలో ఫిర్యాదులు ఇచ్చాం. వాటిని ముసాయిదా ఓటరు జాబితాలో తొలగించలేదు. కనీసం ఈనెల 22న విడుదల చేసే తుది ఓటరు జాబితాలోనైనా వాటన్నింటిని తొలగించండి. జాబితా తప్పుల్లేకుండా చూడాలి' అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వి.సురేంద్రకుమార్ అభ్యర్థించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాజకీయపార్టీల ప్రతినిధులతో డీఆర్వో రాజశేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేంద్రకుమార్ మాట్లాడుతూ.. గతంలో పార్టీ తరపున ఇచ్చిన ఫిర్యాదులను అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డీఆర్వో మాట్లాడుతూ 1400 మందికి మించి ఓటర్లు ఉన్న చోట కొత్త పోలింగ్ కేంద్ర ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. డిసెంబరు 9వ తేదీ వరకు అందిన క్లెయిమ్‌ల విచారణ పూర్తిస్థాయిలో జరిగిందని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే రోజు వరకు ఓటర్ల నమోదుకోసం దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కళాశాలలు, ఇతర ప్రాధాన్యత గల ప్రదేశాల వద్ద ఓటర్ల కోసం ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాస్కర్, పరదేశి (కాంగ్రెస్), ఉదయ్‌కుమార్ (వైసీపీ), ఇతర పార్టీల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

నేటి నుంచి హెల్తీ విలేజ్ జాతీయ సదస్సు

● ముస్తాబైన మహిళా యూనివర్శిటీ ● వివిధ రాష్ట్రాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు రాక



సదస్సు ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17: కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో పద్మావతి విశ్వవిద్యాలయం వేదికగా గురువారం నుంచి మూడు రోజుల పాటు సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల స్థానికీకరణపై ఆరోగ్యకరమైన గ్రామం(హెల్తీ విలేజ్) జాతీయ సదస్సు జరగనుంది. కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి ఏర్పాట్లను పరిశీలించారు. వైద్యశాఖ, డీఆర్‌డీఏ, మెప్మా, టీటీడీ, మహిళా శిశు సంక్షేమ శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మొదటి రోజు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షిస్తారు. ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి (పంచాయతీరాజ్‌శాఖ మంత్రి) కపిల్ మోరేశ్వర్ పాటిల్ పాల్గొంటారు. రాష్ట్రం నుంచి డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బుడి ముత్యాలనాయుడు, జిల్లా మంత్రులు హాజరవుతారు. వివిధ రాష్ట్రాల నుంచి 800మంది ప్రతినిధులు హాజరవుతారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో ముఖ్య అతిథి సందేశం తర్వాత వివిధ రాష్ట్రాల మధ్య చర్చలు జరుగుతాయి. శనివారం జిల్లాలోని ఆదర్శగ్రామాల్లో 250 మంది అతిథుల క్షేత్రస్థాయి సందర్శన ఉంటుంది.

గణతంత్ర వేడుకలు విజయవంతం చేద్దాం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 17: గణతంత్ర దిన వేడుకలను సమన్వయంతో విజయవంతం చేద్దామని జేసీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన డీఆర్వో రాజశేఖర్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. పోలీసు పరేడ్ మైదానంలో 26న ఉదయం 9 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణలో పొరపాట్లకు తావివ్వకుండా చూడాలన్నారు.

జల్లికట్టు వేడుకల్లో విషాదం

ఎద్దు పొడవడంతో తిరుపతివాసి మృతి

చంద్రగిరి, జనవరి 17: చంద్రగిరి మండలంలో బుధవారం నిర్వహించిన జల్లికట్టు వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది.మల్లయ్యపల్లె, దోర్నకంబాల, మండపంపల్లెల్లో నిర్వహించిన జల్లికట్టు సంబరాలతో మూడు గ్రామాలూ తిరుణాళ్ళను తలపించాయి. కోడెగిత్తలను నిలువరించి చెక్కపలకలను సొంతం చేసుకొనేందుకు యువత పోటీపడ్డారు.ఈ ప్రయత్నంలో కొంతమంది గాయపడ్డారు.అనుప్పల్లి-చంద్రగిరి రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలు పెరిగిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. మల్లయ్యపల్లె సమీపంలోని ధనేశ్వరమ్మ ఆలయం వద్ద బుధవారం మధ్యాహ్నం తిరుపతికి చెందిన గురుప్రసాద్ రోడ్డు దాటుతుండగా ఓ ఎద్దు పొడవడంతో అపస్మారస్థితికి చేరుకున్నాడు. 108అంబులెన్సులో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు.




దోర్నకంబాల, జల్లికట్టు ఫోటోలు - ఎద్దు ఢీ కొనడంతో గురుప్రసాద్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశం

వరసిద్ధుడికి చందనాలంకారం

● కాణిపాకంలో ఘనంగా వనభోజనాలు



ధ్వజస్తంభానికి చేపట్టిన పుష్పాలంకరణ

ఐరాల(కాణిపాకం), జనవరి 17: కాణిపాక వరసిద్ధుడి మూల విరాట్‌కు బుధవారం చందనాలంకారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు సల్లా శివశంకర్ ఉభయదారుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మూలవిరాట్‌ను శుద్ధమైన చందనంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం స్థానికంగా ఉన్న కొబ్బరితోటలో వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అందరూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఐరాలలో ఆర్యవైశ్యులు వనభోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం కాణిపాకంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడికి ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు.

నెలాఖరులోపు పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 17: జిల్లాలోని పాడిపశువులకు నెలాఖరులోపు గాలికుంటు వ్యాధి టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ బుధవారం తెలిపారు. జిల్లాలో 5.5 లక్షల పశువులు ఉండగా, 4.90 లక్షల డోసేజ్ టీకాలు వచ్చాయన్నారు. 32వ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలోని 3 లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్లు తెలిపారు. కాగా నెలాఖరులోపు మిగిలిన 1.90 లక్షల డోసేజ్‌లను పశువులకు వేస్తామన్నారు. వ్యాక్సినేషన్ పూర్తి ఉచితమే కాకుండా పాడి రైతుల ఇంటి వద్దకే వెళ్లి టీకాలు వేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికులు మరణిస్తున్నా.. కరగని అధికారుల మనసు

● 127వ రోజుకు చేరిన డెయిరీ కార్మికుల దీక్ష



కలెక్టరేట్ ముందు దీక్ష చేస్తున్న కార్మికులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 17: దీక్ష చేస్తూ కార్మికులు మరణిస్తున్నా, అధికారుల మనసు కరగడం లేదని కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ విజయా డెయిరీ కార్మికులు కలెక్టరేట్ ముందు చేపట్టిన దీక్ష బుధవారానికి 127వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల ఈశ్వర్ మొదలియార్ చనిపోగా, రామ్మూర్తి తలలో గడ్డతో తీవ్రంగా బాధపడుతున్నారని, కార్మికుడు సుబ్రమణ్యం కిడ్నీ సమస్యతో బాధపడుతూ సీఎంసీలో చికిత్స పొందుతున్నారన్నారు. దీక్ష చేస్తున్న కార్మికులు స్తోమత లేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నా, అధికారుల మనసు మాత్రం కరగకపోవడం దారుణమన్నారు. ఇకనైనా తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.దీక్షలో కార్మికులు పాల్గొన్నారు.

నేడు పీటీఎంలో ఎన్టీఆర్ వర్ధంతి

పెద్దతిప్పసముద్రం జనవరి 17 : మండల కేంద్రమైన పీటీఎంలో నేడు ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మొలకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ శంకర్ యాదవ్ పాల్గొంటారని, స్థానిక బస్టాండులో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారని వివరించారు. టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


సాంబశివ(ఫైల్)

నిమ్మనపల్లి, జనవరి 17: ఓ వ్యక్తి అదృశ్యంపై కేసు న మోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. బుధ వారం ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లె పాత బస్టాండుకు చెందిన కందిరీగుల సాంబశివ(55) ఈ నెల 10న ఎక్కడికో వెళ్లిపోయినట్లు ఫిర్యాదు అందిందని తెలిపారు. సాంబశివ గతంలో స్థానిక బస్టాండు సమీపంలో పానీపూరి బండి నిర్వహించే వాడని తెలిపారు. అతని భార్య హేమావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. అతని ఆచూకీ తెలిసిన వారు ఈ కింది నెంబర్ 9440900706, 9652413500 సంప్రదించాలన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

ములకలచెరువు, జనవరి 17: మండలంలోని గూడుపల్లె సమీపంలో బుధవారం దాడులు నిర్వహించి ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.4,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు కుమార్, సుబ్బు, హరి, చిరంజీవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఐటీడీపీ అధ్యక్షుడు


చంద్రబాబుతో దొరస్వామి

కలకడ, జనవరి 17: తిరుపతి జిల్లా నారావారి పల్లెలో మాజీ సీఎం చంద్ర బాబునాయుడుని మర్యాద పూర్వకంగా కలిసినట్లు కలకడ మండల ఐటీడీపీ అధ్యక్షుడు దొర స్వామినాయుడు బుధ వారం తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని సూచించినట్లు అధినేత తెలిపినట్లు చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పని చేయాలన్నారని తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

గుర్రంకొండ, జనవరి 17:అక్రమంగా సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని సంగసముద్రం పంచాయితీ మామిళ్లవారిపల్లెకు చెందిన ఓ వ్యక్తి గ్రామ సమీపంలో సారా అమ్ముతుండగా పోలీసులు పట్టుకొన్నారు. అతని నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

స్వగ్రామానికి జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం జనవరి 17 : ఉమ్మడి తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి నాలుగు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం తమ స్వగ్రామమైన టి.సదుం పంచాయతీ చెన్నరాయుని పల్లెకు విచ్చేసినట్లు మొలకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం నుంచి శనివారం వరకు చెన్నరాయుని ఎల్లెలో ఉంటారని తెలిపారు. రెవిన్యూ అధికారులు పోలీసులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. శనివారం రోడ్డు మార్గంలో మొలకలచెరువుకు వెళ్లి అక్కడి నుంచి ప్రత్యేక రైల్లో వెళుతున్నట్లు తెలిపారు.

మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జమున


బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ జమున

మదనపల్లె టౌన్, జనవరి 17: మదనపల్లె మెడికల్ కాలేజీ ప్రిన్సి పాల్‌గా డాక్టర్ జమున బాధ్యతలు స్వీకరిం చారు. నెల్లూరు మెడికల్ కాలేజీలో అనస్థీషియా ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ జమునను మదనపల్లె మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్‌గా నియ మించడంతో ఆమె బుదవారం మదనపల్లెకు చేరుకుని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళీధర్ నుంచి బాధ్యతలు స్వీకరించారు.. మెడికల్ కాలేజి ప్రొఫెసర్లు, మెడికోల సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

రేపు కలికిరికి కిరణ్‌కుమార్ రెడ్డి

కలికిరి, జనవరి 17: ఇటీవలే బీజేపీలో చేరిన మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి శుక్రవారం కలికిరికి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి కృష్ణప్ప ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు అయన హైదరాబాదులో బయలుదేరి తిరుపతికి విమానంలో రానున్నారని చెప్పారు. సాయంకాలం కలికిరి ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకోనున్నారు. అనంతరం శని, ఆది వారాల్లో స్థానిక కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం సోమవారం మధ్యాహ్నం బెంగుళూరు వెళ్ళి అక్కడి నుంచి హైదరాబాదు చేరుకొంటారని కృష్ణప్ప వివరించారు.

రెచ్చగొట్టే కొద్దీ ఉద్యమిస్తాం..

● నినదించిన అంగన్‌వాడీ కార్యకర్తలు


తంబళ్లపల్లెలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వాల్మీకిపురం, జనవరి 17: కనీస వేతనాల కోసం శాంతియుతంగా తాము సమ్మె చేస్తుండగా, ప్రభుత్వం రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తోందని వాల్మీకిపురంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట తమ షోకాజ్ నోటీసుల విషయమై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయంలో సీడీపీవో అందుబాటులో లేకపోవడంతో షోకాజ్ నోటీసులతో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వేతనాల సమస్య తీర్చమంటే షోకాజ్ నోటీసులు ఇస్తారా.. దేనికీ బెదరం. మా సత్తా ఏంటో ప్రభుత్వానికి చూపిస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారు. మా బతుకులు బాగుపడొద్దా.. మా కుటుంబాలు గడ్డి తినాలా అంటూ విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సీఎం దిగివచ్చి సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మె తీవ్ర స్థాయికి చేరు తుందన్నారు. అనంతరం స్థానిక ప్రాజెక్టు కార్యా లయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ లీడ ర్లు చంద్రావతి, భూకైలేశ్వరి, ప్రసన్న, అమ్మాజీ, లక్ష్మీనరసమ్మ, దేవసేన, రెడ్డిరాణి, గుర్రంకొండ, కలికిరి, వాల్మీకిపురం అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.


బి. కొత్తకోట: మాట్లాడుతున్న అంగన్‌వాడీ నేత రాజేశ్వరి

తంబళ్లపల్లె: మూడు రోడ్ల కూడలిలో శిబిరం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండ్యం మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: స్థానిక దీక్షా శిబిరం వద్ద అన్నమయ్య జిల్లా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నేత రాజేశ్వరి మాట్లాడుతూ ఏ చట్టం ప్రకారం అంగన్వాడీలను తీసివేస్తారని ప్రశ్నించారు. విధుల్లో చేరాలంటూ ఐసిడిఎస్ సిబ్బంది పంపిన నోటీసులకు ప్రతి ఒక్క కార్యకర్త లిఖిత పూర్వకంగా బదులు ఇవ్వాలని తీర్మానించారు. ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు శ్రీవాణి మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగాలు వచ్చిన వారుసమ్మెలో పాల్గొనకూడదని బెదిరించారన్నారు. బలవంతంగా విధుల్లో చేరిన వారిని సైతం సమ్మెలో పాల్గొనే విధంగా యూనియన్ తరపున చర్యలు తీసుకుం టామన్నారు. జీతాలు పెంచినట్లు ప్రకటించేవరకు ధర్నా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బి.కొత్తకోట, మొలకలచెరువు, పీటీఎం కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

వైభవంగా పశువుల పండుగ


కలికిరి: చిట్లాకుప్ప వద్ద జనసందోహం

కలికిరి, జనవరి 17: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పశువుల పండుగను వైభవంగా నిర్వహించారు. కలికిరి క్రాస్ రోడ్డు ప్రాంతవాసులు కలకడ మార్గంలో ఉదయం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో వందలాది మహిళలు పాల్గొన్నారు. యువ కులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. సాయంత్రం చిట్లాకుప్పకు నిప్పు పెట్టి పశువులను బెదిరించి సంబరాలు నిర్వహించారు.

తంబళ్లపల్లె: మండల కేంద్రంలో పశువులను అలంకరించి పిండి వంటలను తినిపించారు. సాయంత్రం మల్లయ్యకొండ రోడ్డులో ఉన్న కాటమరాయుడు దగ్గరకు తీసుకువెళ్లి పూజలు చేశారు. పశువులను చిట్లాకుప్ప చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

కలకడ: మండలంలోని పలు గ్రామాల ప్రజలు బుధవారం పశువుల ఊరేగింపును కోలాహలంగా జరుపుకున్నారు. కలకడ లో ముస్లింలు పశువులను ప్రత్యేకంగా అలం కరించి పుర వీధుల్లో ఊరేగించారు. పశువులను చిట్లాకుప్పల వద్ద ప్రదక్షిణ చేయించి కాటమరాజుకు పూజలు చేశారు.

మదనపల్లె అర్బన్: పట్టణంలోని అనపగుట్ట శ్రీవారినగర్‌లో శ్రీకృష్ణ ఆలయం వద్ద అలంకరించిన పశువులను మేళతాలాల నడుమ చిట్లాకుప్ప చుట్టూ ప్రదక్షిణ చేయించారు. మేకలవారిపల్లె పొలిమేర వద్ద కాటమరాజుకు పూజలు నిర్వహించారు.

తంబళ్లపల్లె: సంస్కృతి సంప్రదాయాల కలయికే సంక్రాంతి పండుగ అని శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసింగ్ కంపెనీ చైర్‌పర్సన్ శ్రీదేవి అన్నారు. బుధవారం తంబళ్లపల్లె తూర్పు హరిజన వాడలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు రంగవల్లులు, పశువులకు అలంకరణ, పిల్లలకు ఆట ల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులతో పాటు స్వీట్స్ అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ లింగా రావు, ఏరియా మేనేజరు మునికృష్ణ, ఏరియా వెటర్నరీ డాక్టర్ విష్ణు ప్రశాంత్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

రవాణా రంగంపై నల్ల చట్టాన్ని ఉపసంహరించుకోవాలి


నిరసన తెలుపుతున్న లారీ, ఐషర్ డ్రైవర్, క్లీనర్ అసోసియేషన్ అధ్యక్షుడు జింకా వెంకటాచలపతి, తదితరులు

మదనపల్లె, జనవరి 17: రవాణారంగంపై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్లచట్టాన్ని రద్దు చేయాలని మదనపల్లె లారీ, ఐషర్ డ్రైవర్, క్లీనర్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. స్థానిక పుంగనూరురోడ్డులోని వై జంక్షన్‌లో ఏపీ జయహో రథసారథి యూనియన్ పిలుపు మేరకు ఈ నిరసన వ్యక్తం చేస్తున్నట్లు యూనియన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ.. కేంద్రం హిట్ అండ్ రన్ నల్లచట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్‌ను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. తమకు వేతనం ఇవ్వాలని, భద్రత కల్పించాలని అడగలేదన్నారు. కేంద్రం మొండివైఖరి వీడకపోతే ఆలిండియా వ్యాప్తంగా లారీ, ఐసర్ యూనియన్ల ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మక్బూల్, ఉపాధ్యక్షుడు చంద్ర, బాబు, అక్బర్, రియాజ్, ఆదం, షబ్బీర్, ఖాదం, షరీఫ్, మల్లి, ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఢిల్లీలో పోరాటం



వాల్మీక సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

మదనపల్లె అర్బన్, జనవరి 17: ఎస్టీ రిజర్వేషన్ కోసం ఢిల్లీలో పోరాడనున్నట్లు వాల్మీకిసంఘం నాయకులు తెలిపారు. బుధవారం ఏపీ రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు గంపల గంగురాజు, జాతీయ కార్యదర్శి మక్కినేని వేణుగోపాల్, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు మేకల విజయమోహన్, రాష్ట్ర కార్యదర్శి పూలకుంట్ల హరిబాబు, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు టేకుపల్లి శ్రీనివాసులు సమావేశంలో పాల్గొని నూతన కమిటీని ఎంపిక చేశారు. జాతీయ కార్యదర్శిగా మక్కినేని వేణుగోపాల్, సౌంత్ ఇండియా జాయింట్ సెక్రటరీలుగా కొత్త ఉడుముశంకర, అరవి లక్ష్మీనారాయణ, రాయలసీమ జాయింట్ సెక్రటరీ చెన్నం శ్రీరాములు, రాయలసీమ అధికారప్రతినిధి నందకుమార్, రాయలసీమ సెక్రటరీ చెన్నవ నాగరాజ, జిల్లా సెక్రటరీ చెన్నం శశిధరబాబు, జిల్లా అధికార ప్రతినిధిగా తలారి కృష్ణప్ప, జిల్లా యూత్ ప్రెసి డెంట్ సాకే శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బాలే శ్రీనివాసులను ఎన్నుకుని నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గంగప్పల గంగరాజు, విజయ మోహన్ మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం తమ లక్ష్యమన్నారు. ప్రస్తుతం గల్లీ నుంచి ఢిల్లీకి పోరాటం చేరుకుందని తెలిపారు.

రానున్నది జనసేన-టీడీపీ ప్రభుత్వమే

మదనపల్లె, జనవరి 17: రాష్ట్రంలో జనసేన-టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని మదనపల్లె నియోజకవర్గ నాయకుడు శ్రీరామరామాంజినేయులు అన్నారు. బుధవారం మదనపల్లెలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, సీనియర్ నాయకుడు ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో శతఘ్ని క్యాలెండరును ఆవిష్కరించి జనసేన నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు. మదనపల్లెకు మంచి అభ్యర్థిని ఎన్నుకోవడంలో ప్రతి ఒక్కరూ శాయశక్తులా కృషి చేస్తామని తెలియచేశారు. కోటకొండ చంద్రశేఖర్, అశ్వత్, ధరణి, శివ, యాసీన్, సోను, సుబ్రీంహర్ష, వినయ్ కుమార్‌రెడ్డి, రమేష్, గంగాధర్, చిన్నరెడ్డి, అనిల్, శేఖర, సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి విజేతలు వీరే..

పెద్దమండ్యం, జనవరి 17: పెద్దమండ్యం మండలంలో బుధవారం జరిగిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర ఫైనల్స్‌లో విజేతల వివరాలను ఎంపీడీవో శ్రీధర్‌రావు వెల్లడించారు. మండలంలోని కలిచెర్లలో ఎన్‌వో పల్లి, బండమీదపల్లి క్రికెట్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బండమీదపల్లి జట్టు విజేతగా నిలిచింది. పెద్దమండ్యం ఎన్‌వోపల్లి మధ్య జరిగిన వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో పెద్దమండ్యం జట్టు విజేతగా నిలవగా, బండమీదపల్లి కలిచెర్ల జట్ల మధ్య జరిగిన బాల్ బ్యాడ్మింటన్ మ్యాచ్‌లో కలిచెర్ల విజేతగా నిలిచింది. కలిచెర్ల వెలిగల్లు జట్ల మధ్య కబడ్డీ ఆటలో కలిచెర్ల జట్టు విజేతగా నిలిచింది. కలిచెర్ల సిద్దవరం జట్ల మధ్య జరిగిన ఖోఖో క్రీడీ పోటీలో కలిచెర్ల జట్టు విజేతగా నిలిచినట్లు ఎంపీడీవో తెలియజేశారు. ఈ జట్లు నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొంటాయని వివరించారు. ఆయా జట్లకు ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్, తహసీల్దార్ రాము, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎంఈవో మనోహర్, సర్పంచులు ట్రోఫీలను అందజేశారు.

బూర్లపల్లె కృష్ణారెడ్డికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పెద్దతిప్పసముద్రం జనవరి 17 : మొలకలచెరువు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, పీటీఎం మండల జడ్పీటీసీ మాజీ సభ్యుడు బూర్లపల్లె కృష్ణారెడ్డిని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే ఏవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు బెంగళూరులోని సెయింట్ జాన్స్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే బెంగళూరులోని ఆసుపత్రికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కృష్ణారెడ్డి కుమారుడు బూర్లపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డికి ధైర్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవమ్మ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి బూర్లపల్లె కృష్ణారెడ్డి ముఖ్య అనుచరుడు. తెలుగుదేశం పార్టీకి వీర విధేయుడిగా, నిబద్ధతగలిగిన కార్యకర్తగా పార్టీ అధినేత చంద్రబాబు వద్ద సైతం గుర్తింపు ఉంది. ప్రవీణ్ కుమార్‌రెడ్డితో పాటు పీటీఎం, బి.కొత్తకోట మండలాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృష్ణారెడ్డి ఆరోగ్యంపై ఆరాతీస్తున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

షిఫ్ట్ ఆపరేటర్ నిర్లక్ష్యం.. లైన్‌మెన్‌కు విద్యుదాఘాతం


గాయపడిన హరీశ్

పీలేరు, జనవరి 17: షిఫ్ట్ ఆపరేటర్ నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు జేఎల్ఎంలకు గాయాలైన సంఘటన బుధవారం పీలేరు మండలం తలపుల గ్రామంలో జరిగింది. తలపుల సచివాలయంలో కె.హరీశ్(27), ఆర్.మునిప్రసాద్(25) గ్రేడ్-2 జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. తలపుల పంచాయతీ పరిధిలోని అబ్బిరెడ్డిగారిపల్లె, మల్లేశ్వరపురం ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల సమస్యలు ఉండడంతో తలపుల సబ్-స్టేషన్‌లో ఎల్‌సీ(లైన్ క్లియర్) తీసుకుని మధ్యాహ్నం 1 గంటకు మరమ్మతులు ప్రారంభించారు. అయితే మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో సబ్-స్టేషన్‌లో విధుల్లో షిఫ్ట్ ఆపరేటర్ బాలాజీ మద్యం మత్తులో అబ్బిరెడ్డిగారిపల్లె ప్రాంతానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాడు. దీంతో లైన్‌పై పనులు చేస్తున్న హరీశ్, మునిప్రసాద్ విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయారు. ఈ విషయం గమనించిన గ్రామస్తులు హుటాహుటిన వారిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హరీశ్ పరిస్థితి విషమంగా ఉండడంతోం వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. మునిప్రసాద్ పరిస్థితి మెరుగ్గా ఉండడంతో పీలేరులో చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనను ట్రాన్స్‌కో అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. పీలేరు ఈఈ మునిచంద్ర సంఘటనా స్థలంతోపాటు తలపుల సబ్-స్టేషన్‌ను పరిశీలించారు. ఈఈ వచ్చిన విషయం తెలుసుకున్న స్థానికులు బాలాజీని సస్పెండ్ చేయాలని కోరుతూ సబ్-స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. లైన్ మ్యాన్ బాలాజీ తరచూ మద్యం సేవించి విధులకు హాజరవుతాడని, ప్రజలతో అమర్యాదగా ప్రవర్తిస్తాడని ఆయన దృష్టికి తెచ్చారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి గ్రామస్తులను శాంతింపజేశారు. ఈ సంఘటనపై విచారణ చేసి బాలాజీపై తగిన చర్యలు తీసుకుంటామని ఈఈ తెలిపారు.

కులగణన సర్వేపై శిక్షణ

తంబళ్లపల్లె, జనవరి 17: కులగణన సర్వేపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో కార్యాలయ ఏవో ఆనంద్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు కులగణనపై శిక్షణ ఇచ్చారు. ఈ నెల 19 నుంచి 28 వరకు ఇంటింటికీ వెళ్లి కులగణన చేయాలని సూచించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీలో అక్రమాలు నివారించండి


సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న టీడీపీ నేతలు

నిమ్మనపల్లి, జనవరి 17: వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయంటూ బుధవారం టీడీపీ నాయకులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రెడెప్పరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ మునిరత్నం, అధికార ప్రతినిధి ఆర్వే వెంకటేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే సంబంధిత రైతే మెటీరియల్‌ను తోలుకోవాల్సి వస్తోందన్నారు. లైన్‌మెన్ ఇష్టా రాజ్యం గా రైతుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. 9 గంటలైనా కరెంట్ సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపించారు. స్తంభం నాటాలంటే రూ.2వేలు, ట్రాన్స్‌ఫార్మర్ పెట్టాలంటే రూ.10వేలు వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే మెటీరియల్ తీసుకెళ్లి మీరే బిగించుకోవాలని చెపుతున్నారన్నారు. దీంతో చేసేదేమీ లేక వారు అడిగినంత డబ్బును చెల్లిస్తున్నట్లు వివరించారు. లైన్‌మెన్‌తోపాటు బయటి వ్యక్తుల అజమాయిషీ ఎక్కువగా ఉందని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకొని అక్రమాలు అరికట్టాలని ఏఈ వసంత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భవాని ప్రసాద్, రాజన్న, మధుబాబు, రెడ్డెప్ప, శ్రీపతి, రమణ, రామకృష్ణ, విజయ్, సూర్యప్రకాశ్, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

'ముస్లింలకు ద్రోహం చేసిన జగన్'


మాట్లాడుతున్న టీడీపీ ముస్లిం నేతలు

మదనపల్లె టౌన్, జనవరి 17: నా ముస్లింలు అని మాటమాటకు చెబుతూనే సీఎం జగన్ తీరని ద్రోహం చేశాడని టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం రఫి ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక అన్నమయ్య సర్కిల్‌లోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తూనే ముస్లింలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చేందుకు ప్రత్యేక బ్యాంకు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఇంత వరకు అమలుకు నోచుకోలేదన్నారు. గతంలో దుల్హన్ పథకానికి రూ..50వేలు ఇస్తుంటే, దాన్ని రూ.లక్ష చేస్తామని చెప్పి మాట తప్పాడన్నారు. రాష్ట్ర విభజన తరువాత రూ.16వేల లోటు బడ్జెట్‌లో కూడా చంద్రబాబు నాయుడు హజ్‌యాత్రకు విజయవాడ, కడపలో హజ్‌హౌస్ నిర్మించారని గుర్తు చేశారు. మన రాష్ట్ర రాజధాని అమరావతి నుంచే నేరుగా మక్కాకు వెళ్లే ఏర్పాట్లు చేశారన్నారు.. ముతవల్లిలకు, ఇమామ్‌లకు గౌరవ వేతనం ఇచ్చారన్నారు. రంజాన్ తోఫా ఇచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నేతలు దాదాపీర్, బావాజాన్, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై దాడి దారుణం

పీలేరు, జనవరి 17: పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో విధుల్లో ఉన్న వైద్యుడు, నర్సింగ్ సిబ్బందిపై సోమవారం జరిగిన దాడి యత్నాన్ని ఐఎంఏ పీలేరు శాఖ ఖండించింది. ఐఎంఏ పీలేరు శాఖ అధ్యక్షుడు డా.చంద్రశేఖర్ మాట్లాడుతూ విషం తాగిన వ్యక్తితోపాటు వచ్చిన అతని బంధువులు వైద్యం అందిస్తున్న వైద్యుడిని అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా వైద్య పరికరాలను ధ్వంసం చేయడం, వాటితో దాడికి యత్నించడం దారుణమన్నారు. రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పనితీరుపై ఇటువంటి సంఘటనలు ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. రోగి పరిస్థితిని బట్టి వైద్యం అందజేయాల్సి ఉంటుందని, రోగి సహాయకులు ఆశించినంత వేగంగా కొన్నిసార్లు రికవరీ జరగదని, ఈ విషయాన్ని అందరూ గమనించాలన్నారు. పీలేరు ఆసుపత్రిలో సోమవారం రాత్రి జరిగిన ఘటనపై సమగ్రంగా విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధాన కార్యదర్శి డా.పవన్ కుమార్, కోశాధికారి డా.ఈశ్వర్ సురేంద్ర డిమాండ్ చేశారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరం


వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న కురవంక సర్పంచ్ చలపతి

మదనపల్లె టౌన్, జనవరి 17: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం మన బాధ్యత అని కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి తెలిపారు. బుధ వారం చిప్పిలి వద్ద రెండు రోజుల వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. శశి కుమార్, చిన్నా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ టోర్నమెంట్ విజేతలకు రూ. 15వేలు, రన్నర్స్‌కు రూ..10వేలు బహుమతి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్, ప్రవీణ్, శివప్రకాష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వన్‌డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి

మదనపల్లె అర్బన్, జనవరి 17: ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని వన్ డిపో మేనేజరు మూడే వెంకటరమణారెడి సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం వన్ డిపో కార్యాలయం వద్ద ఆర్టీసీ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ప్రతి డ్రైవర్ నిబంధనలు పాటించి మదనపల్లె వన్ డిపో కు ప్రమాద రహిత డిపోగా పేరుతేవాలని కోరారు. బస్సులను సక్రమంగా నడిపి ప్రయాణికులకు సౌకర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, సూపర్‌వైజర్లు పాల్గొనానరు.

పృథ్వీ గ్యాస్ట్రో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం


హాస్పిటల్ ను ప్రారంభిస్తున్న డాక్టర్లు పృథ్వీ, అఖిల

మదనపల్లె అర్బన్, జనవరి 17: పట్టణంలో సీటీఎం రోడ్డులో పృథ్వీ గ్యాస్ట్రో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను బుధవారం డాక్టర్లు పృథ్వీ, అఖిల ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో అంతర్జాతీయ ప్రమాణాలు, అధునాతన మైన పరికరాలతో కూడిన హాస్పిటల్‌ను మొట్టమొదటసారిగా మదనపల్లెలో ప్రారంభించామన్నారు. ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్యేలు దేశాయ్ తిప్పారెడ్డి, దొమ్మలపాటి రమేష్, నిషార్‌అహ్మద్, నాగా కుమార్‌రెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అన్నదాన ట్రస్టుకు కూరగాయల వితరణ


తిరుమల దేవస్థానానికి కూరగాయలు తరలిస్తున్న వాహనం

మదనపల్లె అర్బన్, జనవరి 17: పట్టణంలోని కేజే కూరగాయల మండీ అధినేత దాదాపీర్, ఖాజాపీర్ సోదరులు బుధ వారం పది టన్నుల కూరగాయలను తిరుమల, తిరుపతి దేవస్థానంలోని అన్నదాన ట్రస్టుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడేళ్లుగా ప్రతి మూడు నెలలకు ఒకసారి నిత్యాన్నదానానికి కూరగాయలు అందజేస్తున్నామన్నారు. కులమతాలకు అతీతంగా వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో వెలుగు ప్రత్యేక పాఠశాల సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు మెట్రోబాబాజాన్, రెడ్డిరామ్, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఆర్‌వో పరమేశ్వర్

బి.కొత్తకోట జనవరి 17 : అన్ని పోలింగ్ కేంద్రాల్లో యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలని తంబళ్లపల్లె ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ పరమేశ్వర్ అధి కారులను ఆదేశించారు. బుధవారం ఆయన బి.కొత్తకోట నగర పంచాయతీతో పాటు మండలంలోని గుమ్మసముద్రం, కోటావురు తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. విద్యుత్తు, గాలి, వెలుతురు, వికలాంగుల కోసం ర్యాంపు, నీటి వసతి తదితర సౌకర్యాలు అన్ని ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రఫిక్ అహ్మద్‌ను ఆదేశించారు. ఏ క్షణం ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంఈవో రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి, వీఆర్వోలు నరేంద్రకుమార్, తదితరులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

గుర్రంకొండ, జనవరి 17: గుర్రంకొండ మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు జరగనున్నట్లు ఎంపీడీవో వెంకటేశులు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలన్నారు